Follow: @ANNTELUGU
01-10-2026
# మహా పత్రిక
ANN తెలుగు
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 250 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## అక్టోబర్ 2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర

- అపుడు నోట్ బందీ.. ఇపుడు ఓట్ బందీ
- ఈవీఎంలకు బదులు పేపర్ బ్యాలెట్లు వాడాలని తీర్మానం
- ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండియా కూటమి
- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయం వరకు విపక్ష ఎంపీల ప్రదర్శన

**ఢిల్లీ, మహా :** ఓటరు జాబితా సవరణ లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని భట్టి పిలుపు
- ఇండియాటుడే కాంక్లేవ్ లో ఆసక్తికర వ్యాఖ్యలు




02

## ఎస్ఐఆర్‌ను పూర్తిగా వ్యతిరేకించడం లేదు

- బీఆర్ఎస్ నియోజకవర్గాల్లోనే అత్యధిక ఓటర్ల తొలగింపు
- ఇండియాటుడే కాంక్లేవ్‌లో కేటీఆర్



03

## ఇది పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం

- సీఎం చంద్రబాబు
- విజయవాడలో 26,401 పేద కుటుంబాలకు ఇంటి పట్టాల పంపిణీ



02





దుబాయ్ పాస్ పోర్ట్ బ్రోకర్ కొడుకు

# వేలకోట్లకు ఎట్లొచ్చిండు?

- సిరిసిల్ల సభలో సీఎం రేవంత్ రెడ్డి ఫైర్
- అసెంబ్లీలో పార్ట్ -2 ఉంది.. చిట్టా ముందుపెట్టి వంగపెట్టి సప్పరిస్తా
- హైటెక్ సిటీ చుట్టుపక్కల 400గదులు.. మూడు ఫైవ్ స్టార్ హోటళ్ళు
- ఎల్ హోం సర్వీస్ అపార్ట్ మెంట్లు కూడా కేటీఆర్ వే
- సిరిసిల్ల గడిల మీద గురిపెడదాం .. ఫిరంగులమై పేలుదాం
- సిరిసిల్లగడ్డపై జెండా ఎగరేసే మొనగాడికి మంత్రిపదవి
- త్వరలో పద్మశాలికి ఎమ్మెల్సీ.. కేటీఆర్ సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారు
- రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొస్తాం

**సిరిసిల్ల, మహా :** సిరిసిల్ల గడిల మీద గురిపెడదాం. ఫిరంగులమై పేలుదాం. సిరిసిల్ల గడిని నేలమట్టం చేద్దాం ఇదే మన ప్రతిజ్ఞ. రాబోయే ఎన్నికల్లో పద్మశాలి బిడ్డను మండలికి పంపాలి. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలి. గతంలో కవిత ఓడితే వెంటనే కేసీఆర్ మండలి సభ్యురాలిని చేశారు. నేను సీఎం అయితే తెలంగాణ కోసం పోరాడిన విజయశాంతిని మండలి సభ్యురాలిని చేశా. కుటుంబ పాలన కావాలా? అధికార దర్పం కావాలా? ఆలోచించాలి. నాటి జోడీ వైఎస్, డీఎస్ అయితే ఈనాటి జోడీ రేవంత్, మహేశ్. రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ మిగతా 2వ పేజీలో

## సిరిసిల్ల సభ సూపర్ హిట్

భారీపాదయాత్రతో ఉత్సాహం నింపిన సీఎం 02







అయ్యప్ప సొసైటీలో ఆటవిక రాజ్యం- 2...!

# పెట్రేగిపోతున్న బిల్డర్ల అరాచకం..!

| నోటరీలతోనే కోట్లు కొల్లగొడుతున్న వైనం...! | జీరో ధందాకు తెగబడుతున్న కేటుగాళ్లు...! | కోట్లు కొల్లగొడుతున్న రియల్ మాఫియా...! |
|---|---|---|

- అక్రమార్కులకు ప్రజా ప్రతినిధుల అండదండలు...!
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి...!
- రియల్ మాఫియా, అధికారుల కనుసన్నల్లోనే సాగుతున్న అక్రమం..!
- సీఎంసీ కమిషనర్ ఉన్నా లేనట్లే...! అదే బాటలో హైడ్రా...!

భాగ్యనగరానికి గుండెకాయ లాంటి మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో రియల్ మాఫియా బరితెగింపుకు పాల్పడుతోంది.. చట్టం, నిబంధనలు, ప్రభుత్వ ఆదాయం... అన్నింటినీ అడ్డగోలుగా తుంగలో తొక్కుతూ 'ఆటవిక రాజ్యాన్ని' నడుపుతోంది. ప్రభుత్వ అనుమతులతో పనిలేదు, జీహెచ్ఎంసీ రూల్స్ అసలే అక్కర్లేదు.. కేవలం 'నోటరీ' పత్రాలే పెట్టుబడిగా, కోట్ల రూపాయల జీరో ధందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిపోతోంది. ఈ అక్రమ సామ్రాజ్యానికి స్థానిక ప్రజాప్రతినిధుల ఆశీస్సులు, కొంతమంది 'ఇంటి దొంగల' (అధికారుల) అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్కారు ఖజానాకు వందల కోట్ల రూపాయలు భారీగా గండి కొడుతున్న ఈ రియల్ ముఠా ఆగడాలపై సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, సీఎంసీ కమిషనర్ ఉన్నా లేనట్లే వ్యవహరిస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వ్యక్తమవుతున్నాయి. నగరంలో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే 'హైడ్రా' సైతం పత్తా లేకుండా పోయిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

02




## ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టండి

- ఎమ్మెల్సీ అభ్యర్థులకు సీఎం రేవంత్ సూచన
- సీఎంకు, పీసీసీచీఫ్ కు సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కృతజ్ఞతలు

03



## 400 లక్ష్యాన్ని ఇట్టే ఊదేశారు

- వెస్టిండీస్‌పై రెండో వన్డేలో భారత్ ఘన విజయం

03






## త్వరలోనే పార్టీ ప్రకటిస్తా

- వైసీపీ నేతలది బూటకపు ప్రేమ..
- మద్యం కేసులో నా పాత్ర లేదు
- రాజ్ కసిరెడ్డే కర్త, కర్మ, క్రియ
- మాజీ ఎంపీ విజయ సాయి రెడ్డి

**విశాఖపట్నం, మహా :** ప్రజలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చూపిస్తున్న ప్రేమ బూటకమని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. మద్యం కుంభకోణం వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారానికి కర్త, కర్మ, క్రియ రాజ్ కసిరెడ్డేనని ఆయన ఆరోపించారు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయసాయిరెడ్డి పలు అంశాలపై మాట్లాడారు. మిగతా 2వ పేజీలో





# పెట్రేగిపోతున్న బిల్డర్ల అరాచకం...!

**హైదరాబాద్, మహా :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మాదాపూర్ సర్కిల్, ప్రపంచ స్థాయి సదుపాయాలు.. వేల కోట్ల పెట్టుబడులతో మెరిసిపోయే ఐటీ కారిడార్‌కు కూతవేటు దూరంలో ఉన్న అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ భవనాలు నిర్మిస్తూ వాటిని ప్రైవేట్ హాస్టళ్లు, హోటళ్లు, కాలేజీల నిర్వహణకు వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీస ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు కూడా పాటించకుండా బహుళ అంతస్తుల భవనాల్లో విద్యార్థులు, యువతను ఉంచుతున్నారని.. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ పౌరుడు చిన్న ఇల్లు నిర్మించుకోవాలన్నా అనుమతులు, నిబంధనల పేరుతో అనేక దశలు దాటాల్సిన పరిస్థితి ఉండగా.. అయ్యప్ప సొసైటీలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ అనుమతులు, భవన నిర్మాణ నిబంధనలు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు బేఖాతర్ చేస్తూ నిర్మాణాలు సాగుతున్నా అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### నోటరీ కాగితాలే పెట్టుబడి..!

ఇక్కడ ప్రభుత్వ అనుమతులతో పనిలేదని, మున్సిపల్ ప్లాన్ అప్రూవల్స్ అవసరం లేదన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేవలం నోటరీ పత్రాల ఆధారంగా కోట్ల రూపాయల విలువైన ఆస్తుల లావాదేవీలు సాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పక్కనబెట్టి నోటరీ పత్రాలతోనే కోట్ల రూపాయల లావాదేవీలు జరుపుతుండడంతో ప్రభుత్వానికి రావాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుముల రూపంలో భారీ ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేటున్నారు.

### నిర్మాణాలే.. కోట్ల దందానే..!

అయ్యప్ప సొసైటీలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టి వాటిని హాస్టళ్లు, హోటళ్లు, విద్యా సంస్థల అవసరాలకు వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాణిజ్య కార్యకలాపాలు



చందా నాయక్ నగర్ లో

కొనసాగుతున్నా సంబంధిత అనుమతులు, ఆక్యుపెన్సీ, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలను అధికారులు పరిశీలించడం లేదని వారు పేర్కొంటున్నారు. ఫైర్ సేఫ్టీ లేని భవనాల్లో వందలాది మంది ఉంటున్న సందర్భంలో ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం.. భారీ వసూళ్ల ఆరోపణలు..!

అక్రమ నిర్మాణాలు కళ్లముందే సాగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను ప్రారంభంలోనే నిలిపివేయాల్సిన అధికారులు, కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ఒక్కో అక్రమ నిర్మాణానికి భారీ మొత్తాల్లో వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేస్తున్నారనే ప్రచారం కూడా ఉంది.

### ప్రైవేట్ 'సైన్యం' నియమించుకుని భారీగా వసూళ్ళు..!

అక్రమ నిర్మాణదారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ACP) హబీబున్నీసాల పాత్రపై తీవ్ర



శ్రీ చైతన్య ఐ ఐ టి అకాడమీ వెళ్లే దారిలో

ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరిద్దరి కనుసన్నల్లోనే ఒక్కో అక్రమ నిర్మాణానికి ఏకంగా ₹25 లక్షల నుండి ₹30 లక్షల వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ దందాను నడిపించడానికి, డబ్బులు వసూలు చేయడానికి ప్రత్యేకంగా ఒక 'ప్రైవేట్ సైన్యాన్ని' కూడా నియమించుకున్నారని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

### సీఎంసీ కమిషనర్ ఉన్నా.. లేనట్లే..!

అయ్యప్ప సొసైటీలో కళ్లముందే అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని వ్యాపారాలు సాగుతున్నా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసీ) కమిషనర్ ఉన్నా లేనట్లే వ్యవహరిస్తుండటం పౌర సమాజాన్ని విస్తుపోరుస్తోంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కమిషనర్, వినతులు మరియు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా కనీస చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
కన్ను తెరవని 'హైడ్రా'..నిద్రమత్తులో యంత్రాంగం! నగరంలో చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోందని, బుల్డోజర్లతో విరుచుకుపడుతోందని ప్రచారంలో ఉన్న 'హైడ్రా' సైతం అయ్యప్ప సొసైటీ రియల్ మాఫియా విషయంలో పూర్తిగా నిశ్శబ్దాన్ని పాటిస్తుండటం సర్వత్రా అనుమానాలకు తావిస్తోంది. సామాన్యుల అక్రమ నిర్మాణాలపై విరుచుకుపడే 'హైడ్రా' బుల్డోజర్లు... ఐటీ హబ్ నడిబొడ్డున కోట్లాది రూపాయల 'జీరో ధందా' సాగిస్తున్న ఈ రియల్ మాఫియా వద్దకు వచ్చేసరికి ఎందుకు పత్తా లేకుండా పోతున్నాయి?



శ్రీ చైతన్య ఐ ఐ టి అకాడమీ సమీపంలో




సంయుక్త తనిఖీలు ఏవి?: కనీస భవన అనుమతులు, ఫైర్ సేఫ్టీ నోఅబ్జెక్షన్ సర్టిఫికేట్, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు లేవు. వందలాది మంది యువత ప్రాణాలను పణంగా పెట్టి హాస్టళ్లు, కాలేజీలు నడుపుతున్నా 'హైడ్రా', మున్సిపల్, ఫైర్ అధికారులు కలిసి సంయుక్త తనిఖీలు ఎందుకు చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి అయ్యప్ప సొసైటీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై ఉన్నత స్థాయి ఎంక్వైరీ కి ఆదేశించాలిని, లంచాల వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు నిజమని నిర్ధారణ అయితే డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, అసి



వెంకటేశ్వర స్వామి టెంపుల్ సమీపంలో



సిద్ది వినాయక నగర్ లో




స్టెంట్ సిటీ ప్లానర్ హబీబున్నీసాలతో పాటు వారికి సహకరిస్తున్న 'ప్రైవేట్ సైన్యం'పై ఏసీబీ క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మున్సిపల్ అధికారులు

**మొయినాబాద్ మహా:** అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు రూ.75 వేల లంచం డిమాండ్ చేసిన మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిణి గుండు వాణి, సీనియర్ అసిస్టెంట్ ఎలమోని సుదర్శన్ ఏసీబీకి చిక్కారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పి సిటీ రేంజ్-2 గంగసాని శ్రీధర్ బృందం బుధవారం పక్కా ప్రణాళికతో వలపన్ని సుదర్శన్ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న భవనంపై నోటీసులు, ఇతర చర్యలు తీసుకోకుండా ఉండేందుకు వాణి రూ.75 వేలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని సుదర్శన్ ద్వారా తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో సుదర్శన్ బాధితుడి నుంచి నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్టు చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబరు 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

**కొచ్చి, మహా :** జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.



# వేలకోట్లకు ఎట్లొచ్చింది?

( మొదటి పేజీ తరువాయి )

సభలో రేవంత్ ప్రసంగించారు. ఈ సందర్భంగా మునుపటి ప్రభుత్వంపై మండిపడ్డారు. 'ఇక్కడ చేనేత కళను నమ్ముకుని ఎన్నో కుటుంబాలు జీవిస్తున్నాయి. గత పాలకులు ఆ కుటుంబాలను పట్టించుకోలేదు' అంటూ ధ్వజమెత్తారు. సిరిసిల్ల ప్రజల గురించి ఏనాడైనా కేటీఆర్ ఆలోచించారా..? అని ప్రశ్నించారు.

**నిజాంను మించిన కేటీఆర్ కుటుంబ ఆస్తులు**

'ప్రపంచంలోనే ధనిక కుటుంబంగా ఆనాడు నిజాం నవాబుకు పేరుంటే.. ఇవాళ కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని, సిరిసిల్ల ప్రజల ఓట్లను సొమ్ముగా మార్చుకుని రూ.వేల కోట్ల ఆస్తులు సంపాదించుకుని విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించారు. కేటీఆర్‌ను అమెరికా నుంచి దిగుమతి చేసి సిరిసిల్ల ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. 2009 నుంచి 2026 వరకు ఆరుసార్లు ఇక్కడి ప్రజలు గెలిపించారు. అయినా.. ఎందుకు నేత కార్మికుల ఆత్మహత్యలు ఆపలేకపోయారు? గల్ఫ్‌కు వలసపోతున్న కార్మికులను ఎందుకు ఆపలేకపోయారు? మీ కుటుంబాలను ఆదుకోవడానికి అణాపైసా సాయం చేయలేదు. ఒక్క రోజైనా కేసీఆర్ కుటుంబం.. మీ గురించి ఆలోచన చేసిందా? సామాజిక సమస్యలకు నిలయంగా సిరిసిల్ల మారింది. కార్మికుల కన్నీళ్లు, సంఘాల ఆందోళనలకు నిలయంగా మారింది. సిరిసిల్ల సమస్యలకు నిలయంగా మారలేదు.. మార్చారు. సిరిసిల్ల అంటే సిరులకు నిలయం అని అర్థం. ధైర్యం, దైవం కలిసి.. వెలిసిన ప్రాంతం ఇది. సిరిసిల్ల ప్రజల వేలాది ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారు. మానేరు ఇసుక కొల్లగొట్టి కేటీఆర్, రవీందర్‌రావు, సంతోష్‌రావు రూ.వేల కోట్లు దోచుకున్నారు. నేత కార్మికులు, గీత కార్మికులను ఆదుకుంటామన్నారు.. ఏవీ చేయలేదు. వేములవాడ శివయ్య, భద్రాద్రి రామయ్యకు శఠగోపం పెట్టిన వ్యక్తి కేసీఆర్ ఒక్కరే. నేత కార్మికుల కోసం పదేళ్లలో బీఆర్ఎస్ రూ.2,234 కోట్లు ఖర్చు చేస్తే... రెండున్నర సంవత్సరాల ప్రజాపాలనలో రూ.1731 కోట్లు ఇచ్చాం. రెండున్నరేళ్లలో ఈ జిల్లాకు రూ.1700 కోట్ల నిధులు ఇచ్చాం. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల గడీని బద్దలు కొడదాం. సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం.. ఫిరంగులమై పేలుదాం. ఇదే కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిజ్ఞ. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పద్మశాలి బిడ్డను మండలికి పంపాలి. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలి. రేవంత్, మహేశ్ గౌడ్.. జోడీ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను రెండోసారి అధికారంలోకి తీసుకొస్తుంది'' అని సీఎం అన్నారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## సిరిసిల్ల సభ సూపర్ హిట్

**సిరిసిల్ల, మహా** ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉత్సాహంగా సాగింది. సభ సూపర్ హిట్ కాగా, రేవంత్ ప్రసంగానికి కార్యకర్తలు సీటీలు కొట్టారు. కేటీఆర్ అడ్డాలో తమ బలాన్ని నిరూపించేలా కీలక నేతలు, శ్రేణులు, నేతన్నలతో సీఎం మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు లక్ష్యంగా కొంతకాలంగా పదునైన ఆరోపణలు చేస్తూ వస్తున్న రేవంత్ రెడ్డి... బుధవారం తన విమర్శలు పదును మరింత పెంచారు. సిరిసిల్ల వాసులకు జరిగిన అన్యాయం, బీఆర్ఎస్ పాలనతో జరిగిన నష్టాన్ని వివరిస్తూ జోరుగా విమర్శలు ఎక్కుపెట్టారు. బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, స్థానికులు, జిల్లా వాసులతో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని మనసులో మాట వెల్లడించారు. సిరిసిల్ల చేనేత కష్టాలు, కాళేశ్వరం ముంపు సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి ప్రసంగం సాగింది. 2009 నుంచి కేటీఆర్‌ను సిరిసిల్ల ప్రజలు గెలిపించారని, అయినా ఆయన నేతన్నల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేకపోయారని, గల్ఫ్‌కు వలసపోతున్న కార్మికులను ఎందుకు ఆపలేకపోయారని నిలదీశారు.

**కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం**

కరీంనగర్ పర్యటన అనంతరం హెలికాప్టర్‌లో సిరిసిల్లకు చేరుకున్న ముఖ్యమంత్రి ముందుగా ప్రభుత్వ కళాశాల మైదానికి చేరుకున్నారు. అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని రాజ్యాంగ నిర్మాతకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి నేతన్న చౌక్ మీదుగా ర్యాలీగా సభాస్థలి పాదం కలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి అలుపూ లేకుండా మూడుకిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ దారి పొడవునా ప్రజలకు అభివాదం చేశారు. సామాన్య కార్యకర్త నుంచి నాయకుల వరకు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వడివడిగా అడుగులూ వేస్తూ కాంగ్రెస్ శ్రేణుల్లో ఎనలేని ఉత్సాహం నింపారు. మూడు కిలోమీటర్లు నడుస్తూ రగుడు బైపాస్ రంగినేని ట్రస్ట్ పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలికి చేరుకున్నారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం**

బహిరంగ సభాస్థలి వద్దే రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టారు. సిరిసిల్లలో నూతనంగా మంజూరైన నేత బజారు, రూ.5 కోట్లతో పెద్దూరులో నిర్మించనున్న ఇందిరా మహిళా శక్తి భవన్, రూ.15 కోట్లతో రెండు RDO, 4 తహశీల్దార్ కార్యాలయాలకు శంకుస్థాపన, రూ.16 కోట్లతో కొనరావుపేట, సిరిసిల్లలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణం, రూ.99 కోట్లతో వేములవాడ ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 200 కోట్లతో సిరిసిల్లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.10 కోట్లతో రుద్రంగిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

## ఇది పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం

**విజయవాడ, మహా :** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతోందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి జెట్ స్పీడ్‌తో పరుగులు పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, విజయవాడలో 26,401 పేద కుటుంబాలకు ఆయన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. సోమవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'పేదలకు పట్టాభిషేకం' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబాలకు ఇప్పటికే పట్టాలు అందజేశాం. ఇప్పుడు విజయవాడలో 26,401 కుటుంబాలకు రూ.28,112 కోట్ల విలువైన 707 ఎకరాల భూములపై పూర్తి హక్కులు కల్పిస్తున్నాం. ఇది పేదల ఆత్మగౌరవానికి మా ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం" అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 60 వేల కుటుంబాలకు రూ.52 వేల కోట్ల విలువైన భూములను అందించడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.



## త్వరలోనే పార్టీ ప్రకటిస్తా

( మొదటి పేజీ తరువాయి )

త్వరలోనే కొత్త పార్టీ పేరును ప్రకటిస్తానని, అనంతరం పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. వైసీపీకి నష్టం కలిగించిన వారిలో సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఉన్నారని విజయసాయి రెడ్డి ఆరోపించారు. తనను జగన్ వద్ద దుర్మార్గుడిగా చిత్రీకరించిన వ్యక్తి సజ్జలేనని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చే వరకు తనను ఉపయోగించుకున్నారని, అనంతరం తనపై కుట్రలు, దుష్ప్రచారాలు జరిగాయని ఆయన అన్నారు. మూడు నెలల్లోనే తనను పార్టీ నుంచి పక్కన పెట్టారని ఆరోపించారు. రాజధాని అమరావతికి తాను వ్యతిరేకం కాదని విజయసాయి రెడ్డి తెలిపారు. విశాఖను రాజధానిగా చేస్తామని చెప్పి వైసీపీ మాట మార్చిందని విమర్శించారు. "విశాఖను అభివృద్ధి చేస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చారు. ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని ఆయన అన్నారు. మద్యం కుంభకోణం కేసులో తనకు తెలిసిన విషయాలను అధికారులకు వివరించానని విజయసాయి తెలిపారు. ఈ కేసులో తన పాత్ర ఉందన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు.

## అక్టోబర్ 2 నుంచి 'సేవ్ డెమొక్రసీ' యాత్ర

( మొదటి పేజీ తరువాయి )

ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు 'ఓట్ బందీ' ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈవీఎంలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్ ఐఆర్ కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేనయూబీటీ చీఫ్ ఉద్ధవ్ థాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్




తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు.

**జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి**

ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు. ఈ పరిణామాలను అత్యంత కుంభకోణంతో కూడుకున్న విషయంగా మమతా బెనర్జీ అభివర్ణించారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన్ను తొలగించకపోతే ఆందోళనలు ప్రతి మూలకూ విస్తరిస్తామని దీదీ హెచ్చరించారు. ప్రధాని మోదీ సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నారోజు రాకేశ్

**కరీంనగర్ మహా** : కరీంనగర్ నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, కరీంనగర్ 42వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నారోజు రాకేశ్ చారి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించిన రాకేశ్ చారి విద్యార్థులకు సంబంధించిన పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు, వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రాకేశ్ చారి ముఖ్యమంత్రిని కోరారు.



# సీఎం రేవంత్‌రెడ్డికి ఉద్యోగ జేఏసీ ఘన స్వాగతం

**కరీంనగర్ మహా:** కరీంనగర్ జిల్లాకు నూతన పరిపాలనా కేంద్రంగా రూపుదిద్దుకున్న ఇంటిగ్రేటెడ్ జిల్లా కార్యాలయ సముదాయం (IDOC) ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి కరీంనగర్ జిల్లా ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్ నేతృత్వంలో ఉద్యోగులు ముఖ్యమంత్రిని కలిసి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాకు ఆధునిక పరిపాలనా సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా నిర్మించిన IDOC ప్రారంభోత్సవం జిల్లా పరిపాలనా చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టమని పేర్కొన్నారు. నూతన కార్యాలయ సముదాయం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, సమర్థవంతంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకే సముదాయం నుంచి అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.

# ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టండి

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో జరుగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేయనున్న సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలు బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమను అభ్యర్థులుగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలకు సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. ఓటర్ల నమోదు, ప్రచారంపై అభ్యర్థులకు దృష్టి పెట్టాలని, ఎక్కువ సంఖ్యలో ఓట్లు నమోదు చేసే విధంగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి వారికి సూచించారు. నేతలందరని సమన్వయం చేసుకోవాలని, క్షేత్ర స్థాయిలో కేడర్ కి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్లాలని సీఎం సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, టీపీసీసీ చీఫ్, మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కు కూడా నేతలు థ్యాంక్స్ చెప్పారు.

# ఎస్ఐఆర్ ను పూర్తిగా వ్యతిరేకించడం లేదు



**కొచ్చి, మహా :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవసరాన్ని పూర్తిగా వ్యతిరేకించడం లేదని కేటీఆర్ చెప్పారు. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సవరించడం అవసరమేనని పేర్కొన్నారు. అయితే ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనే అత్యధిక ఓటర్ల తొలగింపు జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని.. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన తెలంగాణ రాజకీయాలు, బీఆర్ఎస్ భవిష్యత్తు, బీజేపీతో పొత్తు, డీలిమిటేషన్, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై మాట్లాడారు. తాను ప్రధాన రాజకీయ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నందున వచ్చే ఎన్నికల్లో సీఎం అభ్యర్థి మీరేనా అని అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పష్టంగా సమాధానం ఇచ్చారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని చెప్పారు. 2 ఏళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయిందని చెబుతూ.. ప్రస్తుతం ప్రజలు గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ముఖ్యంగా కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. పార్లమెంట్ స్థానాల సంఖ్యను ప్రస్తుత స్థాయిలో కొనసాగించడంతో పాటు, ప్రాతినిధ్యం విషయంలో అనుపాత విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 2 ఏళ్ల సమయం ఉందని పేర్కొన్న కేటీఆర్.. అందువల్ల తమకు న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించే అవకాశం కూడా ఉందని వెల్లడించారు. ఎన్నికల ముందు ఎస్ఐఆర్ జరిగితే ఎదురయ్యే సమస్యలతో పోలిస్తే ప్రస్తుతం తమకు చట్టపరంగా ప్రశ్నించే సమయం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.



# విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు

- **ప్రభుత్వం స్పందించి పంటలను కాపాడాలి: ఎంపీ ఈటల రాజేందర్**
- **బీజేపీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా**

**పెద్దపల్లి మహా,** సుల్తానాబాద్: రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, పంటలు ఎండిపోకుండా సాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు.జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి నాయకత్వం వహించారు. మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు విద్యుత్ సమస్య, మరోవైపు సాగునీటి కొరతతో పొలాల్లో వేసిన నాట్లు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. ఎల్ఎండీ, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లోని నీటి నిల్వలను సమర్థవంతంగా వినియోగించి రైతుల పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని, రైతుబంధు, రైతుబీమా, సన్న వడ్లకు బోనస్ తదితర హామీలను నెరవేర్చాలని కోరారు. విద్యుత్, సాగునీటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రైతుల పక్షాన ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.



# కంది పప్పు మిల్లు ఏర్పాటుకు స్థల పరిశీలన

- **అంగన్‌వాడి కేంద్రాల్లో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ పై కలెక్టర్ ఆగ్రహం**
- **అంగన్‌వాడీ సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు**

**వరంగల్, పర్వతగిరి మహా ;** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కొంకపాక, పర్వతగిరి మార్కెట్ యార్డులను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద క్షేత్ర స్థాయి అధికారులతో సందర్శించారు. వీవోల సభ్యులతో కలిసి ఆర్గానిక్ పప్పు దినుసులు, మిల్లెట్స్ , మిల్లు, అరటి తో పాటు మోదుగు ఆకుల తో విస్తరాకులు, టిఫిన్ ప్లాట్, తదితర ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు.మహిళా సంఘాల ఆధ్వర్యంలో కంది, ఇతర పప్పు దినుసుల మిల్లును ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా పంటలకు విలువ జోడించడం తో పాటు మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించే అంశం పై అధికారులతో చర్చించారు. మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్, ఉట్టి తండా అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత సరిగా పాటించక పోవడంపై సంబంధిత అంగన్‌వాడీ టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.చిన్నారులకు యూనిఫాం తప్పనిసరిగా ఉండేలా చూడాలని, మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. కేంద్రాల్లో శుభ్రత పరిశుభ్రత తప్పనిసరిగా ఉండేలా ఆయాలు చూడాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించని అంగన్‌వాడీ టీచర్లకు, కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయని అంగన్‌వాడీ సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఉట్టి తండలోని బుద్ధి మాధ్యమం తో ఉన్న పిల్లలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పలకరించి వారిని భవిత సెంటర్లకు పంపించాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు..ఈ కార్యక్రమం లో డీఆర్డీవో నాగ పద్మజా,జిల్లా సంక్షేమ అధికారి నాగమణి, పర్వత గిరి తహసిల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



# 400 లక్ష్యాన్ని ఇట్టే ఊదేశారు

**వెస్టిండీస్‌పై రెండో వన్డేలో భారత్ ఘన విజయం**

**మహా:** భారత్ వెస్టిండీస్ జట్ల మధ్య గౌహతి వేదికగా జరిగిన రసవత్తరమైన రెండో వన్డేలో టీమిండియా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. వెస్టిండీస్ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు అలవోకగా ఛేదించి సరికొత్త చరిత్ర సృష్టించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ( అజేయ డబుల్ సెంచరీతో చెలరేగగా, రోహిత్ శర్మ శతకంతో మెరిశాడు. దీంతో మూడు వన్డేల సిరీస్ 20తో భారత్ కైవసం చేసుకుంది. వెస్టిండీస్ బౌలర్లను చిత్తు చేస్తూ భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కేవలం 117 బంతుల్లోనే 200 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. ఇందులో 24 ఫోర్లు, 7 భారీ సిక్సర్లు ఉన్నాయి. వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా ద్విశతకం బాదిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు సృష్టించి, ఇషాన్ కిషన్ (126 బంతులు) రికార్డును బద్దలు కొట్టాడు. గిల్ వన్డే కెరీర్‌లో ఇది రెండో డబుల్ సెంచరీ కావడం విశేషం. మరోవైపు ఓపెనర్ రోహిత్ శర్మ (101 పరుగులు) అద్భుత శతకం సాధించడంతో పాటు వన్డేల్లో 12,000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు.

# మేడ్చల్ నియోజకవర్గ ఎస్సీ విభాగం ఏ బ్లాక్ అధ్యక్షుడుగా మాట్ల క్రాంతి కుమార్ ఎన్నిక.

**జవహర్ నగర్, మహా:** అణగారిన వర్గాలకు ఆత్మ బంధువును అవుతానని, సామాజిక న్యాయం కోసం నిజాయితీగా పని చేస్తానని మేడ్చల్ జిల్లా నియోజకవర్గ ఎస్సి విభాగం ఏ బ్లాక్ అధ్యక్షుడుగా ఎన్నికైన మాట్ల క్రాంతి కుమార్ పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గ ఎస్సీ విభాగం ఏ బ్లాక్ అధ్యక్షులుగా జవహర్ నగర్ కు చెందిన మాట్ల క్రాంతి కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానానికి, రాష్ట్ర నాయకత్వానికి తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావాలి చంద్రయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని తెలిపారు.



## ఆసియా క్రీడల్లో పెద్దపల్లి బిడ్డ సత్తా

**చికితకు రెండు స్వర్ణాలు**



పెద్దపల్లి మహా : ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన యువ ఆర్చరీ క్రీడాకారిణి చికిత తానిపర్తి ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఆమె అద్భుత విజయంతో సుల్తాన్‌పూర్‌లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. చిన్ననాటి నుంచే చికితలోని క్రీడా ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు ఆర్చరీలో రాణించేలా ప్రోత్సహించడంతోనే ఈ స్థాయికి చేరుకున్నారని గ్రామస్థులు కొనియాడారు. చికిత సాధించిన విజయం పెద్దపల్లి జిల్లా క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లోనూ స్వర్ణ పతకం సాధించి దేశంతో పాటు పెద్దపల్లి జిల్లాకు మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు.



# మహా పత్రిక కథనానికి స్పందన

- **ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ అధికారి కౌన్సిలింగ్**
- **కేవలం ప్రచారానికే కౌన్సిలింగ్ అంటున్న స్థానికులు**
- **ట్రాఫిక్ నియంత్రణలో అధికారి పర్యవేక్షణే లోపమా?**

**వరంగల్, బ్యూరో మహా** ; మహా పత్రికలో వరుసగా ప్రచురితమైన పోచమ్మ మైదాన్ లో ఆటోల బీభత్సం కథనానికి స్పందన లభించింది. బుధవారం వరంగల్ ట్రాఫిక్ అధికారి రంగంలోకి దిగి ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అయితే కేవలం కౌన్సిలింగ్ తోనే ఆటో డ్రైవర్ల తీరు మారుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. పత్రికల్లో కథనాలు రావడం అధికారులు వచ్చి ఆటో డ్రైవర్ల కు కౌన్సిలింగ్ నిర్వహించడం పత్రికలో కథనం వచ్చింది అంటూ వారిని మందలించడం ఇదంతా మామూలే అని స్థానికులు చెబుతున్నారు. అంటే ట్రాఫిక్ నియంత్రణ పై కథనాలు వస్తేనే సంబంధిత అధికారి స్పందిస్తారా అంటూ స్థానిక ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

నిన్నటివరకు పోచమ్మ మైదాన్ లో నడిరోడ్డు పైనే ఆటోలను పార్క్ చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్నారని మహా పత్రిక పదేపదే కథనాలు వచ్చాయి. ఆ కథనాలకు స్పందించిన వరంగల్ ట్రాఫిక్ అధికారి, బుధవారం పోచమ్మ మైదాన్ ఆటో స్టాండ్ వద్దకు వెళ్లి ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్డు మధ్యలో ఆటోలు నిలపొద్దని, క్రమశిక్షణ పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కానీ స్థానికులు మాత్రం ఈ కౌన్సిలింగ్ తంతు పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇలాగే కౌన్సిలింగ్ లు, హెచ్చరికలు చాలాసార్లు జరిగాయని, రెండు రోజులు గడిచాక మళ్లీ మొదటికే వస్తోందని ఆరోపిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారి పై లైసెన్స్ ల రద్దు, ఆటోల సీజ్ వంటి కఠినమైన చర్యలు తీసుకుంటేనే మార్పు సాధ్యమవుతుందని ప్రజలు భావిస్తున్నారు. అసలు సమస్య కౌన్సిలింగ్ లో లేదని, నగరంలో ట్రాఫిక్ అధికారి పర్యవేక్షణ కరువైందని వాహనదారులు అంటున్నారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ట్రాఫిక్ అధికారి తనిఖీల పేరుతో డీడీలు చలాన్లే తప్ప జంక్షన్ల లో పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.నగరంలోని రద్దీ ప్రాంతాలలో అధికారి స్వయంగా పర్యవేక్షిస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు భావిస్తున్నారు. కౌన్సిలింగ్ తో సరిపెట్టకుండా, నడిరోడ్డు పై ఆటోలు నిలిపితే కఠినంగా జరిమానాలు విధించి, ట్రాఫిక్ అధికారి రెగ్యులర్ గా పర్యవేక్షణ చేస్తేనే పోచమ్మ మైదాన్, వరంగల్ బస్టాండ్, కాశిబుగ్గ చౌరస్తా, ఆర్ఎస్టీ రోడ్డు, బట్టల బజార్, రైల్వే స్టేషన్, పోస్ట్ ఆఫీస్ ఇలాంటి రద్దీ ప్రాంతాల వద్ద ట్రాఫిక్ జామ్ కు చెక్ పడుతుందని ప్రజలు, వాహనదారులు అంటున్నారు.

**శాశ్వత పరిష్కారం ఎప్పుడు?**

నగరంలో ఆటోల కోసం ప్రత్యేకంగా డ్రాపింగ్, పికప్ జోన్లను కేటాయించడంలో మున్సిపల్, పోలీస్ అధికారులు విఫలమయ్యారనే వాదన ఉంది. ట్రాఫిక్ పోలీసులు కేవలం చలానాల వసూళ్ల పైనే శ్రద్ధ పెట్టకుండా, నిరంతరం రోడ్ల పై ఉంటూ పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కౌన్సిలింగ్‌లతో కాలయాపన చేయకుండా క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని వరంగల్ నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# స్వచ్ఛ సేవకుల ఆరోగ్య పరిరక్షణే జీడబ్ల్యూఎంసి ధ్యేయం

- **వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కమిషనర్ టి వెంకన్న**
- **కార్మికులకు హెల్త్ కార్డులు, పీపీఈ కిట్లు, ఐడీ కార్డుల పంపిణీ**

**వరంగల్, కార్పొరేషన్ మహా ;** స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం కమిషనర్ టి. వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు కంటి పరీక్షలను స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించగా, వరంగల్ జిల్లా యూపీహెచ్‌సీల వైద్య సిబ్బంది ద్వారా రక్త పరీక్షలు, ఇతర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ప్రతి పారిశుద్ధ్య కార్మికుడికి హెల్త్ కార్డు అందజేసి, వారి ఆరోగ్య వివరాలను అందులో నమోదు చేయనున్నారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే వైద్య శిబిరాలతో పాటు సమీపంలోని యూపీహెచ్‌సీల ద్వారా కూడా వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేలా చర్యలు చేపట్టారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు అవసరమైన పీపీఈ కిట్లను సఫాయి మిత్రులకు అందజేశారు. అలాగే ర్యాగ్ పిక్కర్లు, వ్యర్థాల సేకరణలో పాల్గొనే కార్మికులకు జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో కమిషనర్ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంలో చురుకుగా పనిచేస్తున్న ఇద్దరు స్వచ్ఛ ఆటో డ్రైవర్లను గుర్తించి కమిషనర్ వెంకన్న సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వయంగా కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ నగర పారిశుద్ధ్యానికి వెన్నెముకైన కార్మికుల ఆరోగ్యమే లక్ష్యమని, వారు నగర పరిశుభ్రత కోసం నిరంతరం సేవలందిస్తున్నారని, వారి ఆరోగ్యం తో పాటు భద్రతకు జీడబ్ల్యూఎంసీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా కార్మికుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సానిటరీ సూపర్‌వైజర్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న సిరిసిల్ల సభను చరిత్రలో నిలిచేలా ట్రాక్టర్ ర్యాలీ

- **మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**
- **సిరిసిల్ల రేవంత్ రెడ్డి సభకు భారీ ట్రాక్టర్ ర్యాలీ**

**వేములవాడ, మహా**: సిరిసిల్ల సభను చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేస్తామని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. బుధవారం సిరిసిల్ల కేంద్రంలో నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు వేములవాడ పట్టణ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఆధ్వర్యంలో బుధవారం ట్రాక్టర్ల భారీ ర్యాలీని జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, రైతులు, యువత, ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ శ్రేణులు విశేష సంఖ్యలో స్వచ్ఛందంగా ఈ సభకు తరలివెళ్తున్నారని ఆయన తెలిపారు.స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో నియోజకవర్గ ప్రజలంతా ఏకమై సభను చారిత్రాత్మక విజయవంతం చేసేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ, వేములవాడ పట్టణ ట్రాక్టర్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు సరిపల్లి కార్తీక్ సమక్షంలో, యూనియన్ కార్యవర్గ సభ్యులు, యజమానులు మరియు డ్రైవర్లు అందరూ కలిసి దాదాపు వంద ట్రాక్టర్లతో ర్యాలీగా బయలుదేరడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. చరిత్రలోనే నిలిచిపోయేలా ఒకేసారి ఇన్ని ట్రాక్టర్లతో సభకు మద్దతు తెలపడం గొప్ప విషయమని, సిఎం రేవంత్ రెడ్డి సభను జయప్రదం చేయడంలో ర్యాలీ జరపడం ప్రశంసనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ట్రాక్టర్ యూనియన్ నాయకులు, యజమానులు మరియు పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్నారు.

ANN తెలుగు

**మహా పత్రిక**

గురువారం, హైదరాబాద్
01-10-2026

**మహా ప్రత్యేకం**

**04**



# సిరిసిల్ల జనసంద్రం

## సీఎం రేవంత్ హ్యాపీ

**వెల్లువెత్తిన అభిమానం..**
**నేతలకు సీఎం అభినందనలు**
**కేటీఆర్ కు ఇక వరుస షాకులే**

(మహా ప్రత్యేకం)

సిరిసిల్ల జనసంద్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఓవైపు సీఎం రేవంత్ సిరిసిల్లకు వస్తుంటే స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేరళవెళ్ళారు. సీఎం సభ సూపర్ హిట్ కావడంతో కాంగ్రెస్ క్యాడర్ లో ఉత్సాహం పెల్లుబికింది. సిరిసిల్ల సభ విజయవంతంపై సీఎం ఆనందం వ్యక్తం చేశారు. సిరిసిల్ల అంటే సిరులకు నిలయం. నేతన్నల కళ, కష్టం, నైపుణ్యానికి ఈ గడ్డ చిరునామా. ప్రజా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో చేనేత కార్మికుల కోసం రూ.1,730 కోట్లు ఖర్చు చేశాం. గల్ఫ్ దేశాల్లో ప్రమాదవశాత్తు కార్మికులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకోవడానికి రూ. 5 లక్షల చొప్పన ఆర్థిక సహాయం అందిస్తున్నాం. రైతు రుణమాఫీ, రైతు భరోసా ద్వారా రైతులకు అండగా నిలిచాం. వేములవాడ అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించాం. సిరిసిల్ల–వేములవాడ ప్రాంతంలో విద్య, మహిళా భద్రత, మౌలిక వసతుల అభివృద్ధికి కొత్త పనులకు శ్రీకారం చుట్టాం. అని సీఎం రేవంత్ రెడ్డి పర్యటన అనంతరం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు.

















# దసరా అడ్వాన్స్ 20 వేల చెల్లించాలి

- **అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్**

**బసంత్‌నగర్, మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలో బసంత్‌నగర్ దసరా పండుగ సందర్భంగా అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 20 వేల దసరా అడ్వాన్స్ అందించాలని అల్ట్రాటెక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు.అల్ట్రాటెక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు కౌశిక హరి ఆదేశాల మేరకు, సంఘం జనరల్ సెక్రెటరీ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ AVPHR/IR పార్థసారథి కలిసి దసరా అడ్వాన్స్‌గా రూ.20,000 చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని సత్తి గౌడ్, కండే స్వామి, వైస్ ప్రెసిడెంట్లు ముల్కనూరు శ్రీధర్, సాదిక్ పాషా, జాయింట్ సెక్రెటరీలు పూసాల ప్రసాద్, కొమ్ము శ్రీనివాస్, బాడీ మెంబర్లు రాంసిష్ మోరియా, గాండ్ల సుమన్, తమ్ముడవేణి అంజయ్య తదితరులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



# పాలకుర్తిలో వీఐజీ రాంజీపై అవగాహన

**పాలకుర్తి, మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండల కేంద్రంలో వీఐజీ రాంజీ మండల స్థాయిలో చేపట్టాల్సిన పనులు, కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు ముఖ్యఅతిథులుగా హాజరై సంబంధిత అంశాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఎంపీవో సుదర్శన్, ఏపీవో కొమురయ్య, సీసీ అయూబ్, టీఏ ప్రశాంత్ పాల్గొన్నారు.మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు హాజరై కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్థాయిలో చేపట్టే అభివృద్ధి పనులు, వాటి అమలు విధానం, సంబంధిత అంశాలపై అధికారులు వివరించారు.



# శాయంపేట కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**పెద్దపల్లి మహా: ధర్మారం:** శాయంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లావుడ్య రూప్లా నాయక్ ఆదేశాల మేరకు సర్పంచ్ కూస శ్రీవాణి తిరుపతి ఆధ్వర్యంలో బుధవారం ఈ ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా చేనెల్లి సత్తయ్య, ఉపాధ్యక్షులుగా ఆవుల రాజయ్య, పొన్నం సంతోష్, ప్రధాన కార్యదర్శిగా బొడిగే నర్సయ్య, కార్యదర్శిగా దయ్యాల రమేష్ ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శులుగా బొడిగే మొండయ్య, కాంపెల్లి రాజేశం, దూడ లింగయ్య, కోశాధికారిగా ఆవుల పోశయ్యను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా జాగేటి లచ్చయ్య, బొడిగే శంకరయ్య, కాంపెల్లి ఎషమ్మ, ఐలవేని అంజయ్య, దయ్యాల మల్లేశం, దయ్యాల భాగ్యమ్మ, కూకట్ల పోశయ్య ఎంపికయ్యారు. పార్టీ సలహాదారులుగా సింగిరెడ్డి భూపతి రెడ్డి, కూకట్ల ఓదెలులను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దయ్యాల రజిత రాకేష్, మాజీ సర్పంచ్ చేనెల్లి సాయికుమార్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు బొలిశెట్టి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 10వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ

**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి పట్టణంలోని 10వ వార్డు చీకురాయి రోడ్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులకు అందిస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ శ్రీమతి అక్కేపల్లి సుజాత క్రాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ శ్రీ నూగిల్ల మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మల్లయ్య వార్డు మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం మహిళలకు చీరలను అందించడం సంతోషకరమని తెలిపారు. మహిళలు సంతోషంగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సత్తు శ్రీనివాస్, ఆర్పీ స్రవంతి, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

- **డీజేలు, అనుమతి లేని డ్రోన్లపైనా నిషేధం..**
- **అక్టోబర్ 1 నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలు: సీపీ అంబర్ కిషోర్ ఝా**



**పెద్దపల్లి మహా** : రామగుండం:సాధారణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.
బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో వీధులు, రహదారులపై అసభ్యంగా ప్రవర్తించడం, అసభ్య పదజాలం ఉపయోగించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

**డీజే ధ్వనులు, డ్రోన్లపై ఆంక్షలు**

మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌ల పరిధిలో అధిక శబ్దంతో డీజే ధ్వనులు వినియోగించడంపై ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు సీపీ తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, రోగులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.
కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. మైక్ సెట్ వినియోగానికి నిర్దిష్ట మార్గదర్శకాలు ఉన్నాయని, వాటిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే అనుమతి లేకుండా డ్రోన్లను వినియోగించడంపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నిషేధాజ్ఞలు 2026 అక్టోబర్ 1 నుంచి నవంబర్ 1 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ధర్నాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్-2016లోని సెక్షన్ 7(1), సెక్షన్ 22(1)(a) నుంచి (f), సెక్షన్ 22(2)(a), (b), సెక్షన్ 22(3), సిటీ పోలీస్ యాక్ట్, 1348 నం.IX ఫసలీ, పోలీస్ యాక్ట్-1861లోని సెక్షన్ 30 ప్రకారం అక్టోబర్ 1 ఉదయం 6 గంటల నుంచి నవంబర్ 1 ఉదయం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని సీపీ తెలిపారు.ఈ కాలంలో పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు.అలాగే బంద్‌ల పేరుతో సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కోరారు.



బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్

# ముఖ్య నాయకుల సమావేశం

**పెద్దపల్లి మహా:** పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ ముఖ్య నాయకుల సమావేశం అక్టోబర్ 1న నిర్వహించనున్నారు. ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు రంగంపల్లిలోని ఆర్ ఆర్ గార్డెన్‌లో జరగనుంది. బీఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఎస్సీ సెల్ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# అంకితభావంతో విధులు నిర్వహిస్తే మంచి గుర్తింపు

- **ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ సురేందర్‌కు ఘన సన్మానం: సీపీ అంబర్ కిశోర్ ఝా**

**పెద్దపల్లి మహా** : గోదావరి ఖని: సమర్థవంతంగా, అంకితభావంతో విధులు నిర్వహిస్తే ఉద్యోగ జీవితంలో మంచి గుర్తింపు లభిస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. పోలీస్ శాఖలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ఎన్నో సంవత్సరాల పాటు సేవలందించిన ఉద్యోగులు అభినందనీయులని పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్, గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన బొజ్జ సురేందర్‌ను బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది సహజమైన ఘట్టమని అన్నారు. పోలీస్ శాఖలో సురేందర్ ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో విధులు నిర్వహించడం ప్రశంసనీయమని కొనియాడారు. విధి నిర్వహణలో సమర్థత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన వారికి మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సురేందర్‌కు, ఆయన కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీ హామీ ఇచ్చారు. సురేందర్, ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఆయన పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, భీమేష్, ఆర్ఐ మల్లేశం, సీసీ సందీప్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్, ఉపాధ్యక్షుడు తిరుపతి, సభ్యులు కపిల్, సురేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ..

- **గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 2 వేల మందికి చేయూత..**
- **విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతంగా ఎదగాలి..**
- **ఎంఈవో స్వర్ణజ్యోతి**

**మణుగూరు, మహా :** మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ చిన్నారులకు పలకలను అందజేశారు. మూడు మండలాల పరిధిలో సుమారు 2 వేల మంది విద్యార్థులకు బుధవారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. మణుగూరు మండల విద్యాశాఖ అధికారి జి స్వర్ణజ్యోతి చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు, పలకలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో స్వర్ణజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. వ్యక్తిగత క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకొని భవిష్యత్తులో బాధ్యత కలిగిన మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థుల చదువుకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతి సంవత్సరం అందిస్తున్న చేయూత అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు శామ్యూల్, అశోక్, మురళిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు సహాయం అందించిన దాతలకు సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు..

- **స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..**
- **ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**
- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు / అశ్వాపురం, మహా :** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు కార్డులు, చెక్కులను అందజేశారు. మండలంలోని 24 గ్రామపంచాయతీలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 23 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత సులభతరం చేసే చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా కృషి జరుగుతోందని, వాటి ద్వారా పేద కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అందించే ఆర్థిక సహాయం ఆడబిడ్డల వివాహ సమయంలో పేద కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్ (ఎంఆర్వో), మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కోటిన్నర తో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం



**దమ్మపేట ,మహా :** మండలం లోని పార్కలగండి సమీప రైతులందరూ విద్యుత్ అంతరాయంతో పలు ఇబ్బంధులు ఎదుర్కొంటున్న క్రమంలో ఇటీవల ఈ ప్రాంతానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు ,స్థానిక శాసన సభ్యులు జారె ఆదినారాయణ ద్వారా వినతిపత్రాన్ని అందించడం జరిగింది. ఈ నేపథ్యంలో కోటిన్నర వ్యయంతో పార్కలగండి లో విద్యుత్ సబ్ స్టేషన్ ను బుధవారం టి.జి.యన్ .పి.డి.సి.యల్. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. మోహనరావు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని పట్వారిగూడెం పరిసర గ్రామాల రైతులకు విద్యుత్ అంతరాయం కలగదని తెలిపారు. కార్యక్రమంలో యస్.ఇ. మహిందర్ , డి.ఇ లు భద్రు పవర్ , వెంకటేశ్వర్లు ,ఏడిఈ లు , ఏఇఇలు ,యల్.ఐ లు ,లైన్మ్యాన్ లు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపీ కుటుంబానికి గ్రామీణ

# వైద్యుల ఆర్థిక సాయం

**కారేపల్లి,మహా:** కారేపల్లి మండల మాదారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు పుల్లారావు మృతి చెందాడు. ఆయన సంస్మరణ కార్యక్రమంలో పెద్దమండవలో బుధవారం నిర్వహించారు. పుల్లారావు సంస్మరణ సభ కు గ్రామీణ వైద్యుల సహాయక సంఘం సింగరేణి మండల అధ్యక్షుడు గండమల వెంకటేశ్వర్లు, కార్యదర్శి సిలువేరు రమేష్ హాజరై పుల్లారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల సహాయక సంఘం మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాధారం మాజీ సర్పంచ్ అజ్మీక నరేష్, గ్రామీణ వైద్యులు వి.వెంకటేశ్వర్లు, సతీష్, వేణు, లక్ష్మీనారాయణ, బాబురావు, రఫీ, ఉపేందర్, లక్ష్మణ్, రాజేష్, నరేష్,మోహన్‌రావు, మంగ్య,డి.రాజు,బి.రాజు, నాగచారి, సుమంత్, గిరిబాబు,బాబూలాల్, సర్దార్, నాగేందర్ ,కృష్ణ, కే.కృష్ణ పాల్గొన్నారు.

# తుమ్మల చెరువు ఆయకట్టుకు గోదావరి జలాలు..

- **మారెళ్ళపాడు లిఫ్ట్‌తో పంట పొలాలకు సాగునీరు**
- **తూముల లాకులు తెరిచి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే పాయం**



**మణుగూరు/అశ్వాపురం, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలను తుమ్మల చెరువు ఆయకట్టుకు తరలించి, అక్కడి నుంచి పంట పొలాలకు సాగునీటిని విడుదల చేశారు. బుధవారం అశ్వాపురం మండలం తుమ్మల చెరువు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని స్వయంగా తూముల లాకులు తెరిచి పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి నీటిని తుమ్మల చెరువులోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి తూముల ద్వారా ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీరు చేరే ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు గోదావరి జలాల విడుదలతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులకు అవసరమైన సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలను తుమ్మల చెరువు ఆయకట్టుకు అందుబాటులోకి తీసుకురావడంతో పంటల సాగుకు భరోసా ఏర్పడుతుందని తెలిపారు. ఆయకట్టు పరిధిలోని చివరి భూముల వరకు నీరు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి విడుదలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. తూములు, కాలువల ద్వారా సాగునీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరి, తూముల లాకులు తెరిచి పంట పొలాలకు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల, అధికారుల, స్థానిక నాయకుల, రైతులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి పట్టణాభివృద్ధిపై మున్సిపల్ లో తీర్మానాలకు ఆమోదం

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణంలోని అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కేటాయింపు విషయంలో మున్సిపల్ సమావేశాన్ని బుధవారం నాడు మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ ఎజెండాలో 23 అంశాలను పొందుపరచగా 21 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. ఎజెండాలో పట్టణాభివృద్ధి అంశంలో భాగంగా రోడ్ల వెడల్పు,వీధిదీపాల ఏర్పాటు, రోడ్ల మరమత్తులు, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల వెడల్పులో కోల్పోయిన విద్యుత్ స్తంభాలను తిరిగి ఏర్పాటు చేయుట, దీపాల ఏర్పాటు విద్యుత్ స్తంభాల ఏర్పాటు త్రాగునీటి సరఫరాకు అవసరమైన నిర్మాణ పనులు, వాల్వుల ఏర్పాటు తదితర అంశాలను పట్టణంలోని అన్ని వార్డులను పరిగణలోకి తీసుకొని ఎజెండాను రూపొందించి అందుకు అనుగుణంగా నిధుల ఏర్పాటును, కార్యాచరణ అమలుకై కౌన్సిల్ ఆమోదమునకు సభ్యుల సమక్షంలో తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ తన్నీరు రమేష్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి

- విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. చుంచుపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృతంగా పర్యటించి భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించడంతో పాటు చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా చుంచుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ సర్వే పురోగతి భూ సరిహద్దుల నిర్ధారణ రికార్డుల పరిశీలనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చుంచుపల్లి గ్రామ పరిధిలో మొత్తం 2 వేల 27 ఎకరాల 30 గుంటల భూమి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ భూములతో పాటు వ్యవసాయ భూముల భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో భూ సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడంతో పాటు సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**పాఠశాల తనిఖీ...**

చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు విద్యాబోధన పాఠశాల పరిసరాల పరిశుభ్రత మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రగతిని పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మేధో వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించి వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు హాజరు కావడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అటువంటి విద్యార్థులకు ఇంటి వద్దే విద్యాబోధన అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి విద్యకు దూరం కాకుండా వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం తాగునీరు పారిశుధ్యం తదితర సదుపాయాలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల ఆరోగ్యం భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయడంతో పాటు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు విద్యా ప్రమాణాలు మౌలిక వసతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ నాగరాజు, సర్వే అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ల హక్కులు పరిరక్షించాలి

- ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలను సమగ్రంగా సమీక్షించాలి: సీపీఎం

**సత్తుపల్లి, మహా** : కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సత్తుపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పాత సెంటర్ వద్ద చేపట్టిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా సంఘం స్వతంత్రంగా, పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు మొరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ.. జ్ఞానేష్‌కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో ఉన్నాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల పట్ల సమాన దూరం పాటిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃపరిశీలన (ఎస్ఐఆర్)పై వస్తున్న అభ్యంతరాలను సమగ్రంగా సమీక్షించాలని, ఓటర్ల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతమయ్యేలా నిర్ణయాలు, చర్యలను పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, నాయకులు రావుల రాజబాబు, శీలం కరుణ, చావా రమేష్, చప్పిడి భాస్కర్, ఎస్కే వలి, సైదా, ఎస్కే భాష, వెంకటేశ్వరరావు, జిలాని, రఫీ, నబీ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి నాయకత్వానికి కొత్త బలం

- సత్తుపల్లి విద్యాలయంలో హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్, హౌస్ కెప్టెన్లు, డిప్యూటీ కెప్టెన్ల ప్రమాణ స్వీకారం;
- క్రమశిక్షణతో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఆర్డీవో రాజశేఖర్‌రెడ్డి సూచన

**సత్తుపల్లి, మహా** : శ్రీ చైతన్య టెక్నో కరికులం ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి నూతనంగా ఎంపికైన విద్యార్థి నాయకుల పదవి ప్రమాణ స్వీకార వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి ఆర్డీవో రాజశేఖర్‌రెడ్డి నూతన నాయకులకు బ్యాడ్జిలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. హెడ్‌బాయ్‌గా గౌతమ్, హెడ్‌గర్ల్‌గా అమూల్య, డిప్యూటీ హెడ్‌బాయ్‌గా హరిచరణ్, డిప్యూటీ హెడ్‌గర్ల్‌గా రక్షిత, సీసీఏ కెప్టెన్‌గా శ్రీలాస్య, క్రీడల కెప్టెన్‌గా పార్థశ్రీ బాధ్యతలు స్వీకరించారు. కింగ్స్, రాయల్స్, ఫారోస్, సీజర్స్ హౌస్‌లకు ఎంపికైన కెప్టెన్లు, డిప్యూటీ కెప్టెన్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నాగరాజు, డీన్ నాగార్జున, వైస్‌ప్రిన్సిపాల్ అజిత, పీఈటీ రాజేష్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సత్తుపల్లి డిపో బస్సుల బాట విస్తరణ

- ఖమ్మం, విజయవాడ, అశ్వారావుపేట మార్గాల్లో పెరిగిన సర్వీసులు..
- భద్రాచలం, కొత్తగూడెంకు కొత్త బస్సులు
- ఖమ్మం సర్వీస్ లో తగ్గిన డీలక్స్ చార్జీలు

**సత్తుపల్లి, మహా** : సత్తుపల్లి-ఖమ్మం పట్టణ మార్గంలో ప్రయాణికులకు ఆర్టీసీ మరింత చేరువ కానుంది. రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను పెంచుతూ డిపో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. బుధవారం నుంచి ఈ మార్గంలో నడిచే డీలక్స్ బస్సుల్లో ఎక్స్‌ప్రెస్ ఛార్జీతో ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. దీంతో ఇప్పటివరకు రూ.130గా ఉన్న డీలక్స్ టికెట్ ఛార్జీ రూ.120కు తగ్గనుంది. సత్తుపల్లి-ఖమ్మం మధ్య ప్రయాణికులు ఎక్కువసేపు నిరీక్షించకుండా ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఈ మార్గంలో 10 డీలక్స్ బస్సులతో కలిపి మొత్తం 99 ట్రిప్పులు నడుస్తున్నట్లు డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

**పలు మార్గాల్లో అదనపు సర్వీసులు**

సత్తుపల్లి-విజయవాడ మధ్య ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు నడిచేలా ఏర్పాట్లు చేశారు. సత్తుపల్లి-అశ్వారావుపేట మార్గంలో ప్రస్తుత సర్వీసులకు అదనంగా ఆరు ట్రిప్పులు పెంచారు. విద్యార్థులు, ప్రయాణికుల కోసం సత్తుపల్లి-అంకంపాలెం మధ్య సాయంత్రం 6 గంటలకు ప్రత్యేకంగా మరో ట్రిప్పు నడపనున్నారు. భద్రాచలం, ఏలూరు, సత్తుపల్లి-ఏలూరు మార్గంలో రెండు అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. అంకంపాలెం-ములకలపల్లి-పొగళ్లపల్లి-బూర్గంపాడు మీదుగా భద్రాచలానికి కొత్త పల్లెవెలుగు సర్వీసు ప్రారంభించారు. సత్తుపల్లి-లంకపల్లి-నీలాద్రి మీదుగా కొత్తగూడెంకు కొత్త సర్వీసును ఏర్పాటు చేశారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా పెంచిన సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ కోరారు. అసిస్టెంట్ మేనేజర్ జి.రజిత పాల్గొన్నారు.




# అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం..

- మాజీ జెడ్పీటీసీ పోశం విమర్శలు అర్థరహితం
- సర్పంచ్ కలబోయిన మాధవరావు

**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సింగారం గ్రామపంచాయతీలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్ తెలిపారు. మణుగూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత పాలనతో పోలిస్తే ప్రస్తుతం గ్రామపంచాయతీలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వాటిని చూసి మాజీ జెడ్పీటీసీ పోశం నరసింహారావు రాజకీయ విమర్శలు చేస్తున్నారని వారు ఆరోపించారు. గతంలో జెడ్పీటీసీగా పనిచేసిన సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులపై ప్రజల సమక్షంలో చర్చకు రావాలని సవాల్ చేశారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గత పది నెలలుగా సమితి సింగారం పంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. కోడిపుంజుల వాగులో పూడికతీత, సంత ఏర్పాటు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు విద్యుత్ పథకం వంటి ప్రభుత్వ కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ కోసం మూడు ట్రాక్టర్ల ద్వారా చెత్త తొలగింపు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో సుమారు రూ.5 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపడుతున్నామని, అలాగే రోడ్లు, డ్రైనేజీలు, వైద్యం, విద్యారంగాల్లో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని సర్పంచ్ మాధవరావు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై విమర్శలు చేసే నాయకులు గతంలో చేపట్టిన పనుల వివరాలతో బహిరంగ చర్చకు రావాలని సర్పంచ్, ఉపసర్పంచ్ కోరారు. నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయవద్దని వారు సూచించారు. సమావేశంలో వార్డు సభ్యులు మాధడి రాజేష్, కోల పిన్ని మానస, షేక్ రహీమ్ పాషా, ఊకే కృష్ణవేణి, బిరుదు రాజు శ్రీదేవి, బానోత్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ కుటుంబాలకు 'స్మార్ట్' భరోసా

- కల్లూరు మండలంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ

**సత్తుపల్లి, మహా** : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ బుధవారం కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు అందజేశారు. చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, ఎర్రబోయినపల్లి గ్రామాల్లో అర్హులైన కుటుంబాలకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి గ్రామాల్లో ప్రజలను కలుసుకున్న ఎమ్మెల్యే.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన కుటుంబాలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలకు సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, తహసీల్దార్, ఎంపీడీవో, చిన్న కోరుకొండి సర్పంచ్ బుదేటి గీతా నారపురెడ్డి, పెద్ద కోరుకొండి సర్పంచ్ దేవవరపు నాగమణి సత్యంబాబు, కల్లూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్‌రావు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, మహిళలు పాల్గొన్నారు.



# ప్రజా ప్రతినిధులు అధికారులతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్

**వలిగొండ, మహా న్యూస్** : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క బుధవారం రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో వీబీజీ రామ్ జీ (VBG RAM G) మరియు గ్రామ పంచాయతీలలో చేపడుతున్న ఇతర అభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు మరియు కార్యదర్శులు హాజరై సమావేశంలో పాల్గొన్నారు. ఈజీఎస్ EGS బృందం కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఈ సమావేశానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి ఏపీఓ పరశురాములు ఏపీఎం అంజయ్య మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా గ్రామ పంచాయతీలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వీబీజీ రామ్ జీ పథకం అమలు, సోక్ పిట్ నిర్మాణం, ఎల్‌నినో ప్రభావం, పనుల పురోగతి తదితర అంశాలపై మంత్రి పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ఆదర్శ గ్రామంగా నిలవాలని అలాగే రివార్డ్ కూడా ఉంటుంది అని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సూచించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందలేదని ఆవేదన

- వీల్ చైర్ లోనే ఎమ్మెల్యే ఇంటికి.!
- మంచిర్యాల ప్రభుత్వ దావఖాన తీరుపై తీవ్ర విమర్శలు

**మంచిర్యాల, మహా** : మంచిర్యాల కేంద్రంలో నెలకొన్న ప్రభుత్వ ఆసుపత్రిలో మరోసారి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం బయటపడింది. పేదలకు వైద్యం అందించాల్సిన ఆసుపత్రిలోనే వైద్యం అందక ఓ కొడుకు తన అనారోగ్య తల్లిని అర్ధరాత్రి వీల్ చైర్ లో కూర్చోబెట్టుకుని మంచిర్యాల ఎమ్మెల్యే ఇంటికి తీసుకెళ్లిన హృదయ విదారక ఘటన మంచిర్యాల జిల్లాలో చర్చనీయాంశమైంది.

**అసలేం జరిగింది..?**

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన భూక్యా బుజ్జి (55) కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. మంగళవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుమారుడు భూక్యా రాజ్ కుమార్ ఆమెను జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తీసుకొచ్చాడు. అర్ధరాత్రి సమయంలో సిబ్బంది పట్టించుకోలేదని, బెడ్ అడిగినా ఇవ్వలేదని, తల్లి నొప్పితో విలవిలలాడుతున్నా చికిత్స అందించలేదని కొడుకు ఆరోపించాడు. ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించినందుకు వారు తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. చేసేదేమీ లేక నిస్సహాయ స్థితిలో అదే వీల్ చైర్ లో తల్లిని కూర్చోబెట్టి ఆసుపత్రి నుంచి కిలోమీటరుకు పైగా దూరంలో ఉన్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసానికి అర్ధరాత్రి తీసుకెళ్లాడు. ఎమ్మెల్యే ఇంట్లో లేకపోవడంతో అక్కడున్న సిబ్బంది విషయాన్ని తెలుసుకుని ప్రభుత్వ ఆసుపత్రి ఆర్.ఎం.ఓ. శ్రీధర్ కు సమాచారం ఇచ్చారు. తక్షణమే స్పందించిన ఆర్.ఎం.ఓ. హుటాహుటిన ఎమ్మెల్యే ఇంటికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పి తిరిగి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తామని భరోసా ఇచ్చారు.



**వ్యవస్థ నిర్లక్ష్యానికి నిదర్శనం**

ప్రభుత్వ ఆసుపత్రులు పేదలకు 24 గంటలు ఉచిత సేవలు అందిస్తూ అండగా ఉండాలి. కానీ రాత్రివేళ డాక్టర్లు అందుబాటులో లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి, బెడ్ లేకపోవడం వంటి సమస్యలతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ ఘటన మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై తీవ్ర విమర్శలకు దారితీసింది. ఒక కొడుకు తన తల్లి ప్రాణం కాపాడుకోవడం కోసం వీల్ చైర్ ను తోసుకుంటూ ఎమ్మెల్యే ఇంటి ముందు నిలబడటం వైద్య వ్యవస్థ వైఫల్యానికి ప్రత్యక్ష సాక్ష్యం అని చెప్పవచ్చు.

# సాఫీగా మున్సిపల్ సమావేశం

**బీజేపీ సభ్యుల వాకౌట్**

**పలు అంశాలపై చర్చ ,నిర్ణయాలు**

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం సాదా సీదాగా ముగిసింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ సమావేశం నుండి బీజేపీ సభ్యులు వాకౌట్ చేశారు. సమావేశానికి హాజరై అటెండెన్స్ రిజిస్టర్లలో సంతకాలు చేసిన అనంతరం బయటకు వెళ్లిపోయారు.అనంతరం పలు ఎజెండా అంశాలపై మిగతా సభ్యులు చర్చించారు. పట్టణంలోని పురాతన గాంధీ చౌక్‌లో మహాత్మా గాంధీ విగ్రహంతో పాటు చౌక్ అభివృద్ధి పనులకు రూ.15 లక్షలు కేటాయించాలని చైర్పర్సన్ నిర్ణయించారు మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో ఉన్న మున్సిపల్ స్థలాలు, లీజు స్థలాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించి ప్రత్యేక మ్యాప్‌ను రూపొందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు సమావేశంలో తెలిపారు. తద్వారా ఆయా స్థలాల వివరాలు స్పష్టంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా పట్టణంలో వర్షపాతం సుమారు 40 శాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా, మితంగా వినియోగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నీటిని వృథా కాకుండా సంరక్షించుకోవాలని కోరారు. భవిష్యత్‌లో నీటి కొరత సమస్య తలెత్తకుండా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్ ,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మేనేజర్ , ఆర్ఓ, అకౌంట్స్ ఆఫీసర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణికి 55 వేల కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలి : ఎంపీ ఈటల రాజేందర్

- కార్మికుల శ్రమను తెలంగాణ ప్రభుత్వం దోచుకుంటోంది
- సింగరేణిలో కమిషన్ల దందా నడుస్తోందని తీవ్ర ఆరోపణ
- మంచిర్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో సింగరేణి బకాయి... బీజేపీ లడాయి కార్యక్రమం

**మంచిర్యాల, మహా** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన 55 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే చెల్లించాలని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సీసీసీ క్రాస్‌రోడ్ వద్ద భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సింగరేణి బకాయి... బీజేపీ లడాయి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. సింగరేణిలో అతుత్యాధునిక టెక్నాలజీ, కోల్ ప్లాంట్లు, అనుభవజ్ఞులైన కార్మికులు, సొంత ఇంజనీర్లు ఉన్నప్పటికీ, బొగ్గు తవ్వకం పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం వెనుక పెద్ద ఎత్తున కమిషన్ల దందా నడుస్తోందని తీవ్రంగా ఆరోపించారు. ఓపెన్ కాస్ట్ మైన్లలో ఓవర్ బర్డెన్ తొలగింపుతో పాటు కోల్ మైనింగ్ పనులను కూడా కాంట్రాక్టర్లకే ఇస్తుండటంతో అక్రమాలు పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. కిలోమీటరు దూరంలో బొగ్గును డంప్ చేస్తూ, ఐదు కిలోమీటర్ల దూరంలో డంప్ చేస్తున్నట్లు తప్పుడు లెక్కలు రాసి, వందలాది కోట్ల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఇటీవలే సుమారు 30 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు దొంగతనంపై విచారణ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేసినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అన్నారు.

**కార్మికులకు సరైన వైద్యం అందడం లేదు**

సింగరేణి ఆసుపత్రులలో కార్మికులకు సరైన వైద్యం అందడం లేదని, కనీసం మందులు కొనుగోలు చేసేందుకు కూడా నిధులు లేని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు సకాలంలో చెల్లించకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని చెప్పారు. భూగర్భ గనులలో ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న కార్మికులకు సరైన రక్షణ పరికరాలు అందించడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని బంగారు బాతులా చూస్తే.. నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా ఆ బాతును కోసుకునే ప్రయత్నం చేస్తోందని ఎద్దేవా చేశారు.

**ప్రభుత్వంపై సమరశంఖం**

ఆరు గ్యారెంటీలు, వివిధ డిక్లరేషన్ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలనలో పుట్టకతోనే ప్రతి శిశువుపై 2 లక్షల రూపాయల అప్పు మోపుతోందని తెలిపారు. తెలంగాణ సంపదను కొందరి బ్రోకర్లకు కట్టబెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, లేదంటే సింగరేణి పూర్తిగా మూతపడి కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సింగరేణి కార్మికులకు బీజేపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, మాటలకే పరిమితం కాకుండా క్రియాశీలక పోరాటాలు నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి రఘునందన్, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేష్ గౌడ్, చెన్నూరు ఇన్‌ఛార్జ్ దుర్గం అశోక్, అందుగుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలి

- బెల్లంపల్లి తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాజలింగు కి వినతి పత్రం అందజేసిన ఎం సి పి ఐ యు పార్టీ



**బెల్లంపల్లి, మహా**: ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో నాయకులు బెల్లంపల్లి తాసిల్దార్ కార్యాలయంలోని అధికారికి వినతి పత్రాన్ని బుధవారం నాడు అందజేశారు. మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ( యునైటెడ్ ) ఎం సి పి ఐ యూ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించి తాసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు .అనంతరం జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ లు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ తెలంగాణ సమాజంలో పక్కదారి పట్టించే గ్యారడి మాటలతో ప్రజల మౌలిక సమస్యలైన,విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, నీరు,నీడా, గూడు, గుడ్డ, లాంటి కనీస వసతులు కల్పించడంలో ఘోరంగా వైఫల్యం చెందడం, ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందనీ, చేసిన 6వాగ్దానాలు గ్యారంటీలను విశ్వసించి ప్రజలు మిమ్మల్ని అధికారంలోకి తెచ్చారనీ గుర్తు చేశారు. హామీలలో ఒకటి రెండు హామీల అమలు తప్ప ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందారనీ ఫలితంగా ప్రజల యొక్క కొనుగోలు శక్తి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెరగటం లేదని, తెలంగాణ సమాజం తీవ్ర ఆర్థిక ఆందోళనతో జీవించే పరిస్థితిని 2 సంవత్సరాల 10 నెలల కాలం పాలనలో స్పష్టమవుతుందని ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ప్రజల జీవన ప్రమాణాలను పెంచి కొనుగోలు శక్తి పెంచే విధంగా విద్య, వైద్య,, ఉద్యోగం, ఉపాధి, కూడు,గూడు, గుడ్డ కు, ఏ విధమైన సంక్షోభం లేని తెలంగాణను తీర్చిదిద్దాలని, నిలువ నీడ లేక 60 గజాల ప్రభుత్వం స్థలంలోనీ ఇల్లకు పట్టాలు ఇవ్వాలని పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రానున్న కాలంలో ప్రజా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమైక్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దుర్గం లక్ష్మి, కంపల్లి రాధా, తొగరి రాహుల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐటీఐలో షార్ట్ టర్మ్ కోర్సులు ప్రారంభం..

- నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ప్రిన్సిపాల్ సారంగపాణి



**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో షార్ట్ టర్మ్ కోర్సులను ప్రారంభించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ సారంగపాణి తెలిపారు. బుధవారం ఏటీసీ ప్రాంగణంలో సీఐడీసీ ఆధ్వర్యంలో నిర్వహించే షార్ట్ టర్మ్ కోర్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలు పొందేలా శిక్షణ అందించడమే ఈ కోర్సుల ముఖ్య ఉద్దేశమన్నారు. యువతలో సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసి, వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో అసిస్టెంట్ ట్రాక్టర్ ఆపరేటర్, ఏసీ టెక్నీషియన్, అసిస్టెంట్ షటరింగ్ కార్పెంటర్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాలకు సీఐడీసీ కోఆర్డినేటర్‌ను 7671875436 నంబరులో సంప్రదించవచ్చని, లేదా మణుగూరు ప్రభుత్వ ఐటీఐను నేరుగా సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఐడీసీ కోఆర్డినేటర్ సత్య, ఏటీవో ఎం శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్లు పూర్ణచందర్‌రావు, కార్తికేయతో పాటు ఐటీఐ, ఏటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఆహార భద్రత చట్టం అమలు

- అర్హులందరికీ రేషన్, పౌష్టికాహారం అందేలా చర్యలు
- అధికారులతో సమీక్షా సమావేశం
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పలు ఆదేశాలు




**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం-2013ను పకడ్బందీగా అమలు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, పౌష్టికాహారం, ఆహార భద్రత పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెండు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో అందిస్తున్న గుడ్ల నాణ్యతను సమావేశంలో చైర్మన్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలు, రేషన్ దుకాణాల్లో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేసి, సంబంధిత బాధ్యుల వివరాలు, ఫిర్యాదు చేసే విధానం, టోల్‌ఫ్రీ నంబర్లను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాల హాస్టళ్లలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా భోజన వేళలు, మెనూ అమలు, వంటగది పరిశుభ్రత, వంట సామగ్రి నిర్వహణ, అధికారుల పర్యవేక్షణలో కొన్ని లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులతో విద్యార్థుల సంక్షేమం కోసం పెద్దఎత్తున కార్యక్రమాలు అమలు చేస్తున్న నేపథ్యంలో సిబ్బంది పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.

**ఇది మన హక్కు**

ఫుడ్ కమిషన్ సభ్యులు ఒరగంటి ఆనంద్ మాట్లాడుతూ, ఆహార భద్రత చట్టం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం పొందే హక్కు కల్పించబడిందన్నారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, అవసరమైన వైద్య సేవలు, ప్రత్యేక సంరక్షణ అందేలా చూడాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు బాలామృతం, పాలు, గుడ్లు, పాఠశాల విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉందన్నారు. ఆహార భద్రత హక్కుల అమలులో ఉల్లంఘనలు చోటుచేసుకున్నా, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించినా బాధ్యులపై చర్యలు తీసుకునే అధికారం ఫుడ్ కమిషన్‌కు ఉందన్నారు. అవసరమైన సందర్భాల్లో నష్టపరిహారం చెల్లించేలా కూడా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.

**సక్రమంగా అమలు**

జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలోని 2,566 రేషన్ దుకాణాల ద్వారా 2,27,477 రేషన్ కార్డులకు చెందిన 7,44,404 యూనిట్లకు ప్రతి నెల సుమారు 4,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 20 రేషన్ డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉట్నూర్, ఆదిలాబాద్ డివిజన్లలో చెరో 10 ఖాళీలు ఉన్నాయని వివరించారు. కొత్తగా జారీ చేసిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులకు పంపిణీ చేస్తున్నామని, రేషన్ పంపిణీ ప్రక్రియలో పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం, నిర్దేశిత మెనూను తప్పనిసరిగా అమలు చేయడం, కుక్స్, హెల్పర్లు, వార్డెన్లకు అవసరమైన శిక్షణ ఇవ్వడం, విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ నిర్వహించడం, కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయడం, మెనూ, టోల్‌ఫ్రీ నంబర్లను ప్రదర్శించడం తప్పనిసరి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లలో పోషకాహారం, పరిశుభ్రత, మౌలిక వసతుల పరిస్థితులను 'పోషణ్ చర్చ' యాప్ ద్వారా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక వికాసం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్లను అభివృద్ధి చేస్తున్నామని, విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, పరిశుభ్రతకు సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, లోపాలు గుర్తించిన వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్.చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, డీఆర్‌డీఓ రాథోడ్ రవీందర్, డీఎస్‌వో నందిని, డీఎం సుధారాణి, డీఈవో మాధవి, డీఎంహెచ్‌వో సాధన, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు సోనియా, సునీత, సీడీపీవోలు, ఎంఈవోలు, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను చైతన్య పరచాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి , మహా**: వ్యవసాయంలోసాధారణంగా సాగుచేసే వరి ,పత్తి, మొక్కజొన్న కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను చైతన్య పరచాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమానికి సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు రత్నం సుకుమారి, రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, దుర్గం లక్ష్మీనారాయణ, మహేష్‌ప్రసాద్ తివారి, ఆత్మ చైర్మన్ లు ఆర్. సత్తయ్య, ఓడేటి హనుమంతు, సింగతి మురళి, రఘునందన్ రెడ్డి లతో కలిసి హాజరై స్టాళ్లను పరిశీలించి, మొక్కలు నాటారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి, పత్తి పంటలతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలను అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ఫర్టిలైజర్స్, సేంద్రియ వ్యవసాయం, పామాయిల్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు,మత్స్యశాఖకు సంబంధించిన ఉత్పత్తులు, వ్యవసాయానికి ఉపయోగపడే ఎలక్ట్రానిక్ వాహనాలు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. సాంకేతికతతో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలని, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని, ఉత్పాదకతను పెంచుకోవచ్చని రైతులకు సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ పరిస్థితులు, పంటలకు లభించే ధరలు, సాగు వ్యయం, నీటి లభ్యత తదితర అంశాలను పరిగణన లోకి తీసుకుని అధిక లాభాలను అందించే పంటలను ఎంచుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్, పందిరి సాగు, పండ్ల సాగు వంటి పంటలపై దృష్టి సారించేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల కొరకు చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళిక పకడ్బందీగా చేసుకోవాలని, నానో యూరియా, నానో డి ఎ పి వినియోగం వలన కలిగే లాభాలను రైతులకు వివరించాలని తెలిపారు. రైతుల కొరకు జిల్లాలోని లక్షెట్టిపేటలో విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులు తెలుసుకోవాలని తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీ,సహకారాన్ని రైతులకు వివరించి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆరోగ్యమైన పంట ఉత్పాదకత పెంపొందించేలా అధికారులు,స్వయం సహాయక సంఘాలు సమిష్టిగా కృషి చేయాలన్నారు.

**... సేంద్రియ ఎరువులతో పంటలను పండించాలి.. సిర్పూర్ ఎమ్మెల్యే :పాల్వాయి హరీష్ బాబు**

సిర్పూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన, సహజసిద్ధమైన పంట ఉత్పత్తులను అందించేలా కృషి చేయాలని తెలిపారు. వరి, మొక్క, పత్తి వంటి సాధారణ పంటలే కాకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కల్పిస్తున్న అవకాశాలపై రైతులు చైతన్యవంతులు కావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు అందిస్తున్న పంట మెలకువలు, సూచనలను పాటిస్తూ తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంట దిగుబడి సాధించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రైతులు ముందుకు రావాలని తెలిపారు.అనంతరం జిల్లాలో ఉత్తమంగా వ్యవసాయం చేస్తున్న రైతులను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ,కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ మహేష్ మహేష్ ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి తో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# వైద్య విద్యలో బంగారు పతక విజేత సాయివినీల

**దమ్మపేట ,మహా :** వైద్య విద్య లో అత్యంత ప్రతిభా పురస్కారమైన బంగారు పతకాన్ని సాదించి , తన స్వగ్రామానికి ,విశ్వవిద్యాలయానికి కీర్తి ప్రతిష్టలు పెంపొందించారు. వివరాలు పరిశీలిస్తే మండలం లోని మల్కారం గ్రామానికి చెందిన లక్కదాసు పుల్లయ్య ,పద్మ దంపతుల చిన్న కుమార్తె ఐన సాయి వినీల యం.డి. జనరల్ మెడిసిన్ విద్యలో బంగారు పతకం సాదించింది. డిల్లీలో ని గురుగోవింద్ సింగ్ విశ్వవిద్యాలయం లో యండి మెడిసిన్ పూర్తి చేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా మల్కారం గ్రామానికి పలువురు రాజకీయ నాయకులు స్థానికులు ఆమెను ,తల్లిదండ్రులు ను ప్రశంసించారు. గ్రామంలో సంబరాలు జరిపారు.



# రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు అంకంపాలెం విద్యార్థిని ఎంపిక

**దమ్మపేట,మహా :** మండల పరిదిలోని అంకంపాలెం ఆశ్రమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కుంజా త్రిలోచన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలబాలికల రెజ్లింగ్ విభాగంలో బుధవారం భద్రాద్రి కొత్తగూడెం క్లబ్ లో నిర్వహించిన ఎంపికల్లో భాగంగా పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచింది.అండర్ 17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచిన త్రిలోచనను రాష్ట్రస్థాయిలో జరిగే రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేసినట్లు అంకంపాలెం ఆశ్రమ పాఠశాల హెచ్ఎం శారద, డిప్యూటీ వార్డెన్ నాగమణి, PD వెంకన్న తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచి ,జాతీయ స్థాయికి ఎంపీక కావాలని ఆకాంక్షిస్తూ త్రిలోచనకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**వలిగొండ, మహా న్యూస్ :** ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కేర్చిపెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కేర్చిపెల్లి గ్రామానికి చెందిన మద్దెల వెంకటేష్ బైక్‌పై బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా, కేర్చిపెల్లి నుంచి వలిగొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. స్థానికులు సమాచారం అందించడంతో 108 సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వెంకటేష్‌ను చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు

# సింగరేణి ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, పీడియాట్రిషియన్‌లను నియమించాలి..

- డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని
- సీఎంఓ డాక్టర్ రాజ్ కిరణ్ కుమార్‌కు టిబిజికెఎస్ వినతి



మణుగూరు, మహా : మణుగూరు సింగరేణి ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, పీడియాట్రిషియన్ వైద్యులను పూర్తిస్థాయిలో నియమించాలని మణుగూరు ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు కోరారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లను నియమించడంతో పాటు పలు వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని కోరుతూ కొత్తగూడెం సింగరేణి ప్రధాన వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ రాజ్ కిరణ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగెల్లి మాట్లాడుతూ మణుగూరు ఏరియాలో అధిక సంఖ్యలో యువ కార్మికులు విధులు నిర్వహిస్తున్నందున వారి కుటుంబాలకు అవసరమైన వైద్య సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గైనకాలజిస్ట్, పీడియాట్రిషియన్ వైద్యులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని విజ్ఞప్తి చేశారు.

***- ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి తేవాలి***

మణుగూరు ఏరియాలో వారానికి ఒకసారి దంత వైద్య నిపుణుల సేవలు, ప్రతి 15 రోజులకు ఒకసారి చర్మ వైద్య నిపుణుల సేవలు, నెలకు ఒకసారి ఆర్థోపెడిక్ సర్జన్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రక్త పరీక్షల కోసం పూర్తి ఆటోమేటిక్ సెల్ కౌంటర్ ఏర్పాటు చేయడంతో పాటు కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మణుగూరు ఏరియాలోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మణుగూరు సింగరేణి ఆసుపత్రిలో గర్భిణులకు అవసరమైన పలు పరీక్షల పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ గైనకాలజిస్ట్ లేకపోవడంతో వాటి పూర్తి ప్రయోజనం కార్మిక కుటుంబాలకు అందడం లేదన్నారు. చిన్నపాటి పరీక్షల కోసం కూడా గర్భిణులు కొత్తగూడెం వెళ్లాల్సి రావడంతో అదనపు ప్రయాణ భారం, సమయం వృథా అవుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గైనకాలజిస్ట్‌ను త్వరితగతిన నియమించాలని కోరారు. ఏరియాలో థైరాయిడ్ సంబంధిత కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షల రిపోర్టులు సకాలంలో అందేలా పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచాలని నాగెల్లి కోరారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇతర వైద్య సమస్యలను కూడా సీఎంఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. టిబిజికెఎస్ ప్రతిపాదించిన వైద్య సేవల అంశాలపై చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ రాజ్ కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిగేల నాగేశ్వరరావు, పికె నాగరాజు, ప్రసన్న కుమార్, కోటేశ్వరరావు, ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించాలి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.**



**కుషాయిగూడ. మహా :** మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గంలో కీలక సమావేశం నిర్వహించారు. బుధవారం డా. ఏఎస్ రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలు, పార్టీ బాధ్యులతో ఎమ్మెల్యే చర్చించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్ల జాబితా పునఃసిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక్క అర్హుడి పేరు కూడా ఓటరు జాబితాలో నమోదు కాకుండా మిగలకుండా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ లు కొత్త రామారావు సాయి జన్ శేఖర్. గొల్లూరి అంజయ్య. గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ప్రభుదాస్. బీఆర్ఎస్ నాయకులు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి. మైపాల్ రెడ్డి. నేమూరి మహేష్‌గౌడ్. బైరి నవీన్ గౌడ్. తెలంగాణ ఉద్యమకారుడు. బిఆర్ఎస్ సీనియర్ నేత వంజరి ప్రవీణ్ కరిపే. షేర్ మణమ్మ ఎంకే బదురుద్దీన్.కార్యకర్తలు, పార్టీ బాధ్యులు పాల్గొన్నారు.



# రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

- **ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.**

**కుషాయిగూడ, మహా** : ఉమ్మడి మీర్‌పేట-హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. పలు కాలనీల్లో రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. అన్నపూర్ణ కాలనీ అమ్మవారి చౌరస్తా, నరసింహనగర్‌లోని మదర్ మీరా హైస్కూల్ సమీపంలో, ఓల్డ్ మీర్‌పేట దర్గా సమీపంలో, ఎన్టీఆర్ నగర్ అమ్మవారి ఆలయం వద్ద సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు. బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, ఉల్లెం బాలరాజు, నరసింహగౌడ్, సంజయ్ నాయక్, వాసుచారి, మధు ముదిరాజ్, హరినాథ్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, జయపాల్, బీరప్ప, కృష్ణయాదవ్, శేఖర్‌గౌడ్, కిట్టు, అరుణ్, శ్రీకాంత్ తదితరులు, స్థానికులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ డిపోలో తీవ్ర బస్సుల కొరత

- **కాలం చెల్లిన వాహనాలతో ప్రయాణికుల అష్టకష్టాలు**

**కుషాయిగూడ, మహా** : నేటి ప్రభుత్వ పరిపాలనలో ప్రజా రవాణా వ్యవస్థకు భారీ గండి పడుతోంది. మేడ్చల్ జిల్లాలోని కుషాయిగూడ ఆర్టీసీ డిపో ప్రస్తుతం తీవ్రమైన బస్సుల కొరతతో కొట్టుమిట్టాడుతోంది. నానాటికీ దిగజారుతున్న పరిస్థితుల కారణంగా ఒకప్పుడు కళకళలాడిన ఈ డిపోలో ఇప్పుడు కేవలం కొన్ని బస్సులు మాత్రమే మిగిలాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉన్న కొన్ని బస్సులు కూడా కాలం చెల్లినవి కావడంతో, అవి ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతాయో తెలియని అయోమయ స్థితి నెలకొంది.

**మరమ్మతులకు నోచని వాహనాలు, మెకానిక్‌ల అష్టకష్టాలు**

డిపోలో ఉన్న వాహనాలకు కనీస మరమ్మతులు చేయడానికి కూడా సరియైన స్పేర్ పార్ట్స్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఏదైనా చిన్న సమస్య వచ్చినా విడిభాగాలు దొరక్క మెకానిక్‌లు అష్టకష్టాలు పడుతున్నారు. అరకొర వసతులతో, తూతూ మంత్రంగా బస్సులను రోడ్లపైకి పంపుతుండటంతో ప్రయాణికుల భద్రత గాల్లో దీపంగా మారింది.

**గమ్యస్థానాలు చేరలేక ప్రజల నరకయాతన**

బస్సులు ఏ సమయానికి వస్తాయో, అసలు నడుస్తాయో లేదో తెలియక నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారి మధ్యలో బస్సులు మొరాయించడంతో సమయానికి గమ్యస్థానాలకు చేరలేకపోతున్నారు. ఈ సమాచారం సరిగ్గా తెలియక, రవాణా సౌకర్యం లేక ప్రజలు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. ఇది డిపో సిబ్బందికి, ప్రజలకు మధ్య అనవసరమైన అపార్థాలకు మరియు ఘర్షణ వాతావరణానికి దారి తీస్తోంది.

**ప్రైవేటీకరణే మేలంటున్న కార్మికులు**

ఆర్టీసీని కాపాడుకోవాలని ఒకప్పుడు పోరాడిన కార్మికులే నేడు డిపోలోని దుస్థితిని చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, నిధుల కొరత ఇలాగే కొనసాగితే సంస్థ మనుగడ సాధ్యం కాదని వారు ఆవేదన చెందుతున్నారు. ఈ అస్తవ్యస్త పరిపాలన కంటే 'ఆర్టీసీని ప్రైవేటీకరణ చేస్తేనే మంచిదేమో' అనే చర్చ ప్రస్తుతం డిపో వర్కర్లలో బలంగా వినిపిస్తోంది.పాలకుల ఉదాసీనత వల్లే ఆర్టీసీకి ఈ భారీ గండి పడిందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుషాయిగూడ .డిపోకు కొత్త బస్సులను కేటాయించడంతో పాటు, అవసరమైన స్పేర్ పార్ట్సులను సరఫరా చేసి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీపై పాలకులు సవతి ప్రేమను చూపిస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో ఉన్నటువంటి ఆర్టీసీ డిపోలలో ఎక్కువగా కాలం చెల్లిన వాహనాలే నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి బస్సులు ఫిట్ నెస్ లేకపోవడం. కాలం చెల్లిన వాహనాల వల్ల. ఒకవైపు పర్యావరణం దెబ్బతినడంతో పాటు మరోవైపు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడమే లక్ష్యం

- **ఏనుగు సుదర్శన్ రెడ్డి**
- **కీసర డివిజన్‌లో సేవా దివస్ అభియాన్‌లో భాగంగా చిత్రలేఖన, ఉపన్యాస పోటీలు**



**కుషాయిగూడ, మహా** : రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సేవా ప్రస్థానం, వికసిత్ భారత్ 2047 కార్యక్రమాల్లో భాగంగా సేవా దివస్ అభియాన్ కార్యక్రమాన్ని కీసర డివిజన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు త్వరలోనే బహుమతులు అందజేస్తామని ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి తెలిపారు. కీసర డివిజన్ అధ్యక్షుడు కోల బాలరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లాల తిరుమల్ రెడ్డి, సేవా దివస్ అభియాన్ కార్యక్రమం కన్వీనర్ బోడ శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధవరం లక్ష్మి, కీసర డివిజన్ ఇంచార్జ్ గౌరారం జగన్ గౌడ్, జిల్లా నాయకులు రావుల అశోక్ ముదిరాజ్, మెట్టు కృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి నాగరాజ్ ముదిరాజ్, శ్రీనివాస్ గోసుల, మెట్టు మహేందర్ యాదవ్, లింగం ముదిరాజ్ తో పాటు అధ్యాపకుల బృందం పాల్గొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, జాతీయ భావన, దేశ అభివృద్ధిపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు.

# నకిలీ ఎరువుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి!

- **రైతులకు నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు...**
- **జిల్లా వ్యవసాయ అధికారిని సుజాత**
- **కోళ్ల ఫారం గోదాముల యజమానులకు హెచ్చరిక...**
- **అద్దెకు ఇస్తే టెనెంట్ చిరునామా తప్పనిసరి..!**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: జిల్లాలో నకిలీ, అనధికార ఎరువుల తయారీ, ప్యాకింగ్ నిల్వకు పాల్పడే వ్యక్తులపై వ్యవసాయ, పోలీస్ శాఖల సమన్వయంతో కఠిన చర్యలు చేపడుతున్నట్లు, రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిని సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు నెలలలో అబ్దుల్లా పూర్మెట్ మండలం పెద్ద అంబర్ పేట, కుంట్లూరు గ్రామాలలో ఇటీవల రెండుసార్లు నకిలీ ఎరువుల ప్యాకింగ్ నిల్వలను చేదించడం జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ... అబ్దుల్లాపూర్మెట్ మండలం కుంట్లూర్ గ్రామంలో ఇటీవల అనుమతి లేకుండా ఎరువుల తయారీ, ప్యాకింగ్ మరియు నిల్వ చేస్తున్నట్లు గుర్తించిన ఘటనలో ఎంఒపి, డిఏపి కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించిన నిల్వలు, ప్యాకింగ్ ముడిసరుకును గుర్తించడం జరిగింది.. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ముగ్గురిని అరెస్టు చేయడం జరిగింది. అదేవిధంగా, షెడ్ యజమానిపై క్రిమినల్ కేసునమోదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని రైతులు నకిలీ ఎరువుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ సూచించింది.

**పాత పౌల్ట్రీ షెడ్లు, గోదాములు, భవనాల యజమానులకు ప్రత్యేక హెచ్చరిక...**

జిల్లాలో ఇటీవల వెలుగుచూసిన ఘటనల నేపథ్యంలో వదిలివేసిన పౌల్ట్రీ షెడ్లు, పాత గోదాములు, ఇనుప షెడ్లు, ఖాళీ భవనాలు ఇతర నిర్మాణాలను అద్దెకు ఇచ్చే యజమానులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. ఇలాంటి ప్రదేశాలను అనధికార ఎరువుల తయారీ, ప్యాకింగ్ లేదా నిల్వ కోసం దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున యజమానులు అప్రమత్తంగా ఉండాలి.

అద్దెకు ఇస్తే టెనెంట్ చిరునామా తప్పనిసరి..!

అద్దెకు ఇచ్చే ముందు అద్దెదారు టెనెంట్ యొక్క ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, పూర్తి చిరునామా మరియు ఇతర గుర్తింపు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకుని, అద్దె ఒప్పందాన్ని లిఖితపూర్వకంగా చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, అద్దెకు తీసుకున్న వ్యక్తి ఆ ప్రదేశంలో ఏ కార్యకలాపం నిర్వహిస్తున్నారో యజమానులు తెలుసుకోవాలి. ఎరువులు, పురుగుమందులు లేదా ఇతర వ్యవసాయ పనిముట్ల తయారీ, ప్యాకింగ్, నిల్వ జరుగుతున్నట్లు అనుమానం కలిగితే వెంటనే వ్యవసాయ శాఖకు లేదా పోలీసులకు సమాచారం అందించాలి. అద్దెకు తీసుకున్న స్థలంలో, ఈ విధమైన అక్రమాలకు పాల్పడితే, ఆ యొక్క యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఆ యొక్క యజమానిని మొదటి ముద్దాయి ఎ1 గా చేర్చడం జరుగుతుందని హెచ్చరించారు. అద్దెకు ఇచ్చిన ప్రదేశాన్ని అక్రమ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు తెలిసినప్పటికీ నిర్లక్ష్యం చేయకుండా, సంబంధిత అధికారులకు సమాచారం అందించడం ద్వారా రైతుల ప్రయోజనాలను, వ్యవసాయ పనిముట్ల నాణ్యతను కాపాడేందుకు సహకరించాలని యజమానులను కోరారు.

వ్యవసాయ శాఖ-పోలీసుల సంయుక్త తనిఖీలు..

నకిలీ ఎరువుల తయారీ, అక్రమ నిల్వ మరియు రవాణాను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామస్థాయి నిఘా, నిగరాణి కమిటీలతో కలిసి పోలీస్ శాఖ సమన్వయంతో తనిఖీలు చేపట్టాలని అనుమానాస్పద ప్రాంతాల్లో నిఘా ముఖ్యంగా పాత పౌల్ట్రీ షెడ్లు, ఇనుప షెడ్లు, పాడుబడిన భవనాలు మరియు ఇతర అనుమానాస్పద ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి కొనసాగించాలని జిల్లా వ్యవసాయ అధికారి అన్ని మండలాల వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేయడం జరిగింది.

# శంషాబాద్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముగ్గురు పెడ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 80 గ్రాముల మెథాంఫెటమైన్, 4 ఎల్ఎస్‌డీ బ్లాట్స్, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సంపత్‌నగర్‌లోని హెచ్‌ఎండీఏ నర్సరీ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న సయ్యద్ హుస్సేన్ అలియాస్ లంబా, మహమ్మద్ ఇమ్రాన్ అలియాస్ షుకూర్, రహ్మనుద్దీన్ అలియాస్ లాలాలను అదుపులోకి తీసుకుని విచారించగా డ్రగ్స్ విక్రయాల వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. బెంగళూరుకు చెందిన ప్రధాన పెడ్లర్ జంషెడ్ నుంచి మత్తు పదార్థాలను తెప్పించి సబ్ పెడ్లర్లకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ప్రధాన నిందితుడు లంబాపై గతంలో 270కుపైగా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న జంషెడ్, సబ్ పెడ్లర్ సయ్యద్ జోహైర్ మెహదీ కోసం గాలింపు కొనసాగుతోంది. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఆర్జీఐఏ ఎస్‌హెచ్‌ఓ బి. సంజీవులు, డీఐ పవన్‌కుమార్, సిబ్బందిని ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ అభినందించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, నిల్వ లేదా కొనుగోలుకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# చిలుకానగర్‌లో హరితహారం

- **ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి పర్యావరణాన్ని పరిరక్షించాలి : ఎమ్మెల్యే**

**కుషాయిగూడ, మహా** : చిలుకానగర్ డివిజన్‌లోని ముస్లిం కబరస్థాన్, గ్రేవ్‌యార్డ్‌లో అధ్యక్షుడు షేక్ అబు ఆధ్వర్యంలో హరిత హారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కబరస్థాన్, గ్రేవ్‌యార్డ్ పరిసరాల్లో పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.





# నిధుల బాధ్యత నాది... అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు చేర్చే బాధ్యత మీది

- **కార్యాలయాలకే పరిమితం కావొద్దు... అంకితభావంతో పనిచేయాలి**
- **ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి**

**యాచారం సెప్టెంబర్ 30 మహా**: హైదరాబాద్ నగరాన్ని తలదన్నేలా యాచారం మండలాన్ని తీర్చిదిద్దుతామని... అధ్వానస్థితిలో ఉన్న మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారు అన్నారు. బుధవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత సమావేశం అనంతరం, చేపట్టిన కార్యక్రమాలు, పథకాల అమలుతీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. పలువురు అధికారులు సమావేశానికి హాజరుకాకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే... నిర్లక్ష్యధోరణి వీడకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పాలనలో జవాబుదారీతనం అవసరం**

అధికారులు కార్యాలయాలకే పరిమితం కావొద్దని మల్‌రెడ్డి తెలిపారు. పనుల కోసం వచ్చే ప్రజలను చుట్టూ తిప్పుకోకుండా జవాబుదారీతనంతో పనిచేయాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాల అమలులోనూ రాజకీయాలకతీతంగా పేదలను గుర్తించి, అర్హులైన వారందరికీ అందించాలన్నారు. అభివృద్ధికి అవసరమయ్యే నిధుల బాధ్యత తనదని చెప్పిన ఎమ్మెల్యే... అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేర్చే బాధ్యత అధికారులపైనే ఉంటుందని తెలిపారు.

**భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తాం...**

విషపూరిత ఫార్మా ఏర్పాటుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులు... పరిహారం విషయంలోనూ రైతులకు అన్యాయం చేశారని మల్‌రెడ్డి రంగారెడ్డి మండిపడ్డారు. గతంలో ఎకరానికి రూ.8లక్షలిస్తే, తాము పరిహారంతో పాటు కోటిన్నర విలువైన స్థలం బాధితులకిచ్చి ఆదుకుంటున్నట్లు తెలిపారు. అసైన్డ్ రైతులు, కబ్జాలో ఉన్న వారందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేపు జర్నలిస్టుల నిరసన

- **టియుడబ్ల్యుజె మేడ్చల్ జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి**

**కుషాయిగూడ, మహా** : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2న గాంధీ విగ్రహాల వద్ద నిర్వహించ తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామ్ రెడ్డి పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు కాప్రా మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేసే కార్యక్రమంలో ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్ నియోజకవర్గాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొంటారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు, మీడియా సంస్థల సమస్యలు ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని, గత నాలుగు దశాబ్దాల కాలంగా మీడియా రంగంలో చోటు చేసుకున్న విప్లవాత్మకమైన మార్పులకు తోడు, జర్నలిజం నైతిక విలువలకు సంబంధించిన పలు సూచనలు, సిఫార్సులను చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మీడియా కమిషన్ ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో ఈ నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. వేతన బోర్డు, జర్నలిస్టుల రక్షణ చట్టాలను ఏర్పాటు చేయాలన్న తదితర డిమాండ్లతో ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రజా పాలన మొదలై మూడేళ్లు గడుస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం ఆందోళనకరమన్నారు. గడిచిన మూడేళ్ల కాలంలో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. గతంలో ఉన్నహెల్త్ స్కీం లను పునరుద్ధరించాలని టీయూడబ్ల్యూజే మొదటి నుంచి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులతో సమానంగా ఆరోగ్య భద్రత కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకటనకే పరిమితమయ్యాయని తెలిపారు. జర్నలిస్టు కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం జర్నలిస్టులు ఆందోళన బాట పట్టక తప్పని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. అదే విధంగా ఇళ్ళు, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆరోపించారు.



# పదవి విరమణ పొందిన షేక్ లియకత్ ఆలీ.!

- **33 సంవత్సరాలు సుదీర్ఘ సేవలందించిన ఆలీ**
- **ఆయనను ఘనంగా సన్మానించిన సహచర ఉద్యోగులు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో క్లీనర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ లియకత్ అలీ 33 సంవత్సరాల సుదీర్ఘ సేవలను పూర్తి చేసుకొని బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించి, షేక్ లియకత్ అలీని కార్యాలయ అధికారి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా సిబ్బంది అభినందించారు. దీర్ఘకాలం పాటు కార్యాలయంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, తన సేవలతో సహచరుల మన్ననలు పొందిన షేక్ లియకత్ అలీకి అధికారులు, సిబ్బంది పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి బాలేశ్వరి, ఏవీఎస్ ప్రసాద్, టైపిస్టు అనిత, ఆఫీస్ సబార్డినేట్ ఫకీర్ చంద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల పంపిణీ..

- **హెల్త్ కార్డుల పంపిణీ చేసిన కమిషనర్ వై సుదర్శన్**
- **మున్సిపాలిటీ కార్యాలయంలో లిమ్స్ హాస్పిటల్ ఆరోగ్య శిబిరం**

**ఇబ్రహీంపట్నం , మహా:** స్వచ్ఛత హీ సేవా - 2026 కార్యక్రమంలో భాగంగా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో "సఫాయి మిత్ర సురక్షా ఏవం సమ్మాన్ శిబిర్" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, కమిషనర్ సుదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్ మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికుల కోసం, లిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, మున్సిపల్ కార్మికులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ కార్డులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ, భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ హాస్పటల్ యాజమాన్యం, డాక్టర్లు, మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ప్రణవ్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సేవే పరమావధి.. ఆ పన్నులకు అభయహస్తంలా మాజీ డిప్యూటీ మేయర్

**అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం అందజేత**

**జవహర్ నగర్, మహా :** సేవే పరమావధిగా ఆపన్నులకు అభాగ్యులకు, అభయ హస్తంలా నిలుస్తూ, జవహర్ నగర్ లో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్త. జవహర్ నగర్ కెవిన్ఆర్ కాలనీలో కాలనీ వాసి పట్నాల చంద్రశేఖర్ హఠాత్తుగా మరణించగా విషయం తెలుసుకున్న శ్రీనివాస్ గుప్తా బుధవారం చంద్రశేఖర్ కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవడంలోనే ఆత్మ సంతృప్తి దాగి ఉందని ప్రేమే పరమావధిగా సేవ చేయడంలోనే ఆత్మసంతృప్తి సాధించవచ్చునని తెలిపారు. జవహర్ నగర్ లో గరీబోల్లే ఎక్కువగా నివసిస్తున్నారని వారి అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తూ, పేద ప్రజలకు అండగా నిలవాలన్నారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, కందుల శంకర్, పండాల రాజు గౌడ్, సింగం బాలరాజ్ పటేల్, భాశెట్టి వీరేష్, ఉచ్చంతల రాములు, నంగునూరు అశోక్ గుప్తా, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటీటీలోనూ ఇరుముడి దూకుడు

**హైదరాబాద్ మహా:** మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' సినిమా థియేటర్లలో సత్తా చాటిన తర్వాత ఇప్పుడు ఓటీటీలోనూ తన జోరు కొనసాగిస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తండ్రీకూతుళ్ల అనుబంధం, కుటుంబ భావోద్వేగాలు, అయ్యప్ప దీక్ష నేపథ్యంలో రూపొందింది. ఆగస్టులో థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించగా.. బాక్సాఫీస్ వద్ద కూడా భారీ వసూళ్లు నమోదయ్యాయి. 'ఇరుముడి'లో రవితేజ త్రినాథ్ పాత్రలో కనిపించారు. మద్యానికి బానిసైన త్రినాథ్ అయ్యప్ప దీక్ష తీసుకుని 40 రోజుల పాటు మద్యానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంటాడు. మరోవైపు తన తండ్రితో ఎంతో అనుబంధంగా ఉండే కుమార్తె మణెమ్మ పాత్ర కథలో కీలకంగా ఉంటుంది. స్కూల్‌లో జరిగే విషయాల నుంచి ఇంట్లో ఎదురయ్యే సంఘటనల వరకు ప్రతిదాన్ని తండ్రితో పంచుకునే చిన్నారి పాత్ర కథలో భావోద్వేగాన్ని పెంచుతుంది. రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటించారు. ఆమె కావేరి పాత్రలో కనిపించగా.. సాయికుమార్, స్వాసిక తదితరులు కీలక పాత్రలు పోషించారు. శివ నిర్వాణ కథను ఎక్కువగా సహజమైన లొకేషన్లలో చిత్రీకరించడం ద్వారా కుటుంబ కథకు వాస్తవికతను తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ఒడిశా సరిహద్దులోని సీలేరు ప్రాంతంలోనూ సినిమా షూటింగ్ జరిగింది. థియేటర్లలో 'ఇరుముడి' వసూళ్ల పరంగా కూడా గణనీయమైన స్థాయికి చేరుకుంది. విడుదలైన 24 రోజుల తర్వాత భారత్‌లో సుమారు రూ.208.18 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ఇండస్ట్రీ అంచనాలను ఉటంకిస్తూ నివేదికలు వెల్లడించాయి. దీంతో 2026లో రూ.200 కోట్ల మార్క్ దాటిన చిత్రాల జాబితాలో ఇది చేరింది. ఇక సెప్టెంబర్ 18 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో 'ఇరుముడి' స్ట్రీమింగ్ ప్రారంభమైంది. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ ఈ చిత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. థియేటర్లలో సినిమాను చూడలేకపోయిన ప్రేక్షకులకు ఓటీటీ ద్వారా మరోసారి ఈ కథను చూసే అవకాశం లభించింది. ఓటీటీలోకి వచ్చిన తర్వాత కూడా సినిమాకు సంబంధించిన చర్చ కొనసాగుతోంది. నెట్‌ఫ్లిక్స్ ఇండియా ట్రెండింగ్‌లో 'ఇరుముడి' నంబర్ వన్‌గా నిలిచినట్లు సెప్టెంబర్ 20న వచ్చిన నివేదికలు పేర్కొన్నాయి. దీంతో థియేటర్ల తర్వాత డిజిటల్ వేదికపైనా ఈ సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలకు కూడా స్పందన వచ్చింది. ముఖ్యంగా 'మల్లెపూల పల్లకి' పాట థియేటర్లలో ప్రేక్షకుల నుంచి ప్రత్యేక స్పందన అందుకున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ప్రస్తుతం థియేటర్ల విజయాన్ని ఓటీటీ వేదికపైనా కొనసాగిస్తున్న 'ఇరుముడి'.. రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలిచింది.

# భీమవరం నుంచి టైమ్స్ స్క్వేర్ వరకు

హైదరాబాద్ మహా: సినీ నటి వితిక పేరు ప్రస్తుతం న్యూయార్క్ పర్యటనలో సందడి చేస్తున్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన టైమ్స్ స్క్వేర్ వద్ద సంప్రదాయ చీరకట్టులో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెల్లటి చీరకు అందమైన పూల డిజైన్ జత చేయడంతో ఆమె లుక్ సింపుల్‌గా, అదే సమయంలో స్టైలిష్‌గా కనిపించింది. నగరంలోని వెలుగులు, భారీ డిజిటల్ స్క్రీన్ల మధ్య చీరలో వితిక దిగిన ఫొటోలు ప్రత్యేకంగా నిలిచాయి. టైమ్స్ స్క్వేర్ పరిసరాల్లో వివిధ రకాల పోజులతో ఫొటోలకు ఫోజులిచ్చిన వితిక.. తన సంప్రదాయ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. సాధారణంగా వెస్ట్రన్ ఫ్యాషన్‌లో కనిపించే న్యూయార్క్ వీధుల్లో చీరకట్టుతో కనిపించడం ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. తెలుపు రంగు చీరకు సరిపోయేలా ఆభరణాలు, మేకప్, హెయిర్‌స్టైల్‌ను సింపుల్‌గా ఉంచుకోవడం ద్వారా సహజమైన అందాన్ని హైలైట్ చేశారు. వితిక పేరు తెలుగు ప్రేక్షకులకు నటిగా మాత్రమే కాకుండా టెలివిజన్ వ్యక్తిత్వంగా కూడా పరిచయం. బాలనటిగా కెరీర్‌ను ప్రారంభించిన ఆమె అనంతరం హీరోయిన్‌గా సినిమాల్లోకి అడుగుపెట్టారు. పలు తెలుగు చిత్రాల్లో నటించి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. నటుడు వరుణ్ సందేశ్‌తో వివాహం తర్వాత కూడా వితిక సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా అభిమానులకు దగ్గరగా ఉంటున్నారు. బిగ్‌బాస్ తెలుగు మూడో సీజన్‌లో పాల్గొన్న తర్వాత వితికకు మరింత గుర్తింపు లభించింది. అప్పటి నుంచి ఆమెకు సోషల్ మీడియాలో ఫాలోయింగ్ కూడా పెరిగింది. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలతో పాటు ఫ్యాషన్, ట్రావెల్ ఫొటోలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటుంటారు. తాజాగా న్యూయార్క్ ట్రిప్‌లో భాగంగా టైమ్స్ స్క్వేర్ వద్ద దిగిన ఫొటోలను అభిమానులతో షేర్ చేశారు. చీరలో వితిక కనిపించిన తీరు నెటిజన్లను ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ నగర వాతావరణంలో భారతీయ సంప్రదాయ దుస్తులతో కనిపించడం ఫొటోలకు ప్రత్యేకమైన లుక్‌ను తీసుకొచ్చింది. ముఖ్యంగా తెల్లటి చీర, పూల డిజైన్, బ్యాక్‌గ్రౌండ్‌లో టైమ్స్ స్క్వేర్ వెలుగులు కలిసిపోవడంతో ఫొటోలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.





# 25 ఏళ్ల ప్రయాణం.. సుమ ఎమోషనల్

**హైదరాబాద్ మహా:** తెలుగు బుల్లితెరపై తనదైన యాంకరింగ్ శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుమ కనకాల మరో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమతో ఆమెకు ఉన్న అనుబంధానికి 25 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, హీరో జూనియర్ ఎన్టీఆర్ కలిసి సుమకు ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఆమె సినీ ప్రయాణంలోని ముఖ్యమైన ఘట్టాలను గుర్తుచేస్తూ ప్రత్యేకంగా రూపొందించిన వీడియోను ఓ సినిమా ప్రీరిలీజ్ కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ వీడియోను చూసిన సుమ భావోద్వేగానికి గురయ్యారు. సుమ కనకాల సినిమా యాంకరింగ్ ప్రయాణం 'స్టూడెంట్ నంబర్ 1' చిత్రంతో ప్రారంభమైంది. ఈ సినిమాతోనే ఆమెకు రాజమౌళి, జూనియర్ ఎన్టీఆర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమలో జరిగిన అనేక ప్రీరిలీజ్ ఈవెంట్లు, సినిమా ప్రమోషన్లు, ఇంటర్వ్యూలకు సుమ యాంకర్‌గా వ్యవహరించారు. స్టార్ హీరోలు, దర్శకులు, నిర్మాతలు పాల్గొనే కార్యక్రమాల్లో ఆమె తన మాటతీరుతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి భారీ చిత్రాల ప్రమోషన్ కార్యక్రమాల్లోనూ సుమ భాగమయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ 'బిగ్‌బాస్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించిన సమయంలో సుమతో జరిగిన సంభాషణలకు సంబంధించిన దృశ్యాలను కూడా ప్రత్యేక వీడియోలో పొందుపరిచారు. దీంతో సుమ గత 25 ఏళ్ల సినీ ప్రయాణంలోని ఎన్నో జ్ఞాపకాలు మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. తన కోసం ఇంత ప్రత్యేకమైన వీడియోను సిద్ధం చేస్తారని ఊహించలేదని సుమ తెలిపారు. సాధారణంగా ఇతరుల గురించి రూపొందించిన వీడియోలను చూస్తూ వారిపై మాట్లాడటం తనకు సులభమేనని, అయితే తన ప్రయాణాన్ని తెరపై చూసినప్పుడు ఏం మాట్లాడాలో కూడా అర్థం కాలేదని భావోద్వేగానికి గురయ్యారు. తన సినీ ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సుమకు తెలుగు భాష మాతృభాష కాకపోయినా అనర్గళంగా తెలుగులో మాట్లాడటం, సందర్భానికి తగ్గట్టుగా హాస్యం పండించడం, చురుకైన మాటతీరుతో కార్యక్రమాలను నడిపించడం ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. టీవీ షోలు, సినిమా ఈవెంట్లు, అవార్డు కార్యక్రమాలు, ప్రీరిలీజ్ వేడుకలు ఇలా విభిన్న వేదికలపై ఆమె తనదైన ముద్ర వేశారు. 25 ఏళ్ల సినీ యాంకరింగ్ ప్రయాణంలో తనతో కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరినీ సుమ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు 'స్టూడెంట్ నంబర్ 1'తో మొదలైన ప్రయాణం.. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాల ప్రమోషన్ల వరకు కొనసాగడం తనకు ప్రత్యేకమైన అనుభూతి అని ఆమె పేర్కొన్నారు. ఈ సర్‌ప్రైజ్ వీడియోతో తన గతాన్ని మరోసారి గుర్తుచేసుకునే అవకాశం లభించిందని తెలిపారు. ఇక ఈ వేడుకలో సుమకు లభించిన సర్‌ప్రైజ్ వీడియో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన కెరీర్‌లోని కీలక సందర్భాలను ఒక్కచోట చూసిన సుమ కంటతడి పెట్టుకోవడం అక్కడి వారిని కూడా భావోద్వేగానికి గురిచేసింది. 25 ఏళ్ల సినీ యాంకరింగ్ ప్రయాణానికి సంబంధించిన జ్ఞాపకాలను గుర్తుచేస్తూ రాజమౌళి, ఎన్టీఆర్ అందించిన ఈ ప్రత్యేక కానుక సుమకు మరచిపోలేని సందర్భంగా మారింది.





# కాఫీ విత్ కరణ్‌కు గుడ్‌బై

**హైదరాబాద్ మహా:** బాలీవుడ్ సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలు, సినిమాలు, కెరీర్ విశేషాలతో ప్రేక్షకులను అలరించిన ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'కు ముగింపు పలకనున్నారు. ఈ కార్యక్రమం 9వ సీజన్‌తో పూర్తిగా వీడ్కోలు తీసుకోబోతోంది. షో హోస్ట్, దర్శకుడు కరణ్ జోహార్ తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. దాదాపు 22 ఏళ్లుగా ప్రేక్షకులతో కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి ఇదే చివరి సీజన్ కానుంది. 2004లో ప్రారంభమైన 'కాఫీ విత్ కరణ్' అనతి కాలంలోనే బాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. సినీ తారలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారి వ్యక్తిగత జీవితాలు, కెరీర్, స్నేహాలు, సినిమాలు తదితర అంశాలపై కరణ్ జోహార్ చర్చించేవారు. షోలోని ర్యాపిడ్ ఫైర్ రౌండ్స్, సరదా ప్రశ్నలు, కాఫీ హ్యాంపర్లు, సెలబ్రిటీల ఆసక్తికర సమాధానాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం తొలి ఎపిసోడ్‌లో షారుఖ్ ఖాన్, కాజోల్ అతిథులుగా పాల్గొన్నారు. ఆ తర్వాత బాలీవుడ్‌కు చెందిన అనేక మంది ప్రముఖ నటీనటులు ఈ షోలో పాల్గొన్నారు. సెలబ్రిటీల మధ్య స్నేహాలు, సంబంధాలు, సినిమాలకు సంబంధించిన విషయాలు షోలో చర్చకు రావడంతో పలు సందర్భాల్లో ఆ వ్యాఖ్యలు సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారాయి.తాజాగా కరణ్ జోహార్ విడుదల చేసిన భావోద్వేగ వీడియోలో ఈ షోతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 2004లో తండ్రి యశ్ జోహార్‌తో జరిగిన సంభాషణను కూడా ఆయన ప్రస్తావించారు. మొదట ఈ కార్యక్రమం ఎలా ప్రారంభమైంది, ఇన్నేళ్లలో ఎలాంటి జ్ఞాపకాలు మిగిలాయో కరణ్ తన వీడియోలో గుర్తుచేసుకున్నారు. షో తన జీవితంలో స్నేహాలు, జ్ఞాపకాలు, సరదా సందర్భాలు, ప్రేమతో పాటు వివాదాలను కూడా తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు.ఈ షో ఇప్పటివరకు ఎనిమిది సీజన్లను పూర్తి చేసుకుంది. మొత్తం 161 ఎపిసోడ్లతో రెండు దశాబ్దాలకు పైగా ప్రేక్షకులను అలరించింది. ప్రతి సీజన్‌లోనూ కొత్త సెలబ్రిటీ కాంబినేషన్లు, ఆసక్తికరమైన సంభాషణలు, సరదా గేమ్స్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 2026లో ప్రసారం కానున్న 9వ సీజన్ మాత్రం ఈ ప్రయాణానికి చివరి అధ్యాయంగా ఉండనుంది. కరణ్ జోహార్ షోకు ముగింపు పలకడానికి మరో కారణాన్ని కూడా వెల్లడించారు. రాబోయే సంవత్సరాల్లో మరిన్ని సినిమాలకు దర్శకత్వం వహిస్తూ కొత్త కథలను చెప్పాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. 'కాఫీ విత్ కరణ్'ను ముగించడం తనకు భావోద్వేగ నిర్ణయమే అయినప్పటికీ, ఇప్పుడు ఈ ప్రయాణాన్ని ముగించాల్సిన సమయం వచ్చిందని భావిస్తున్నట్లు చెప్పారు. 9వ సీజన్ అక్టోబర్ 14 నుంచి జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. చివరి సీజన్‌లో ఎవరెవరు అతిథులుగా పాల్గొంటారనే పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే రెండు దశాబ్దాలకు పైగా కొనసాగిన ఈ షోకు చివరి సీజన్ కావడంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# ఎన్టీఆర్-త్రివిక్రమ్.. స్క్రిప్ట్ రెడీ

హైదరాబాద్ మహా: జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న తదుపరి చిత్రంపై కీలక అప్‌డేట్ వచ్చింది. 'అరవింద సమేత వీర రాఘవ' తర్వాత మరోసారి ఈ ఇద్దరూ కలిసి పనిచేయబోతున్న విషయం తెలిసిందే. తాజాగా త్రివిక్రమ్ స్వయంగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సినిమా పూర్తి స్క్రిప్ట్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో యాంకర్ సుమ కనకాల.. ఎన్టీఆర్, త్రివిక్రమ్ కలిసి ఉన్న ఫొటోను చూపిస్తూ ఈ కాంబినేషన్‌లో సినిమా రాబోతుందా అని ప్రశ్నించారు. దీనికి త్రివిక్రమ్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సినిమా స్క్రిప్ట్ పూర్తయిందని తెలిపారు. దీంతో చాలాకాలంగా ఈ ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్న ఎన్టీఆర్ అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాకు సంబంధించి 'గాడ్ ఆఫ్ వార్' అనే పేరు కొంతకాలంగా సోషల్ మీడియాలో ప్రచారంలో ఉంది. అయితే ఈ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ఖరారు చేయలేదని త్రివిక్రమ్ తాజా వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. కథకు, పాత్రకు, వివిధ భాషల్లో సినిమాకు సరిపోయేలా అధికారిక టైటిల్‌ను ఖరారు చేసే ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్‌త్రివిక్రమ్ కాంబినేషన్‌కు ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన 'అరవింద సమేత వీర రాఘవ' ప్రేక్షకులను ఆకట్టుకుంది. కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్, బలమైన సంభాషణలతో రూపొందిన ఆ చిత్రం తర్వాత మళ్లీ వీరిద్దరూ కలిసి పనిచేయడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈసారి మరింత భారీ స్థాయిలో ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ పౌరాణిక అంశాలతో కూడిన భారీ చిత్రంగా ఉండొచ్చనే సమాచారం కూడా ప్రచారంలో ఉంది. అధికారిక ప్రకటన సమయంలో విడుదల చేసిన పోస్టర్, 'శివుడి కుమారుడు.. పార్వతి పుత్రుడు.. శాశ్వత సేనాధిపతి' అనే భావనను ప్రతిబింబించేలా ఉండటంతో కథ కార్తికేయుడు లేదా మురుగన్ చుట్టూ తిరుగుతుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే పూర్తి కథ, పాత్రలు, టైటిల్ వంటి వివరాలపై చిత్రబృందం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. సంగీతం కోసం అనిరుధ్ రవిచందర్ పేరు వినిపిస్తోంది. ఎన్టీఆర్‌తో 'దేవర' తర్వాత అనిరుధ్ మరోసారి కలిసి పనిచేయనున్నారనే సమాచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. భారీ విజువల్స్, ప్రొడక్షన్ డిజైన్, గ్రాఫిక్స్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఎన్టీఆర్ తన ఇతర కమిట్‌మెంట్లతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' తర్వాత త్రివిక్రమ్ చిత్రంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో 2027లో ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలపై చర్చ జరుగుతోంది. అయితే అధికారిక షూటింగ్ తేదీని చిత్రబృందం ప్రకటించాల్సి ఉంది. స్క్రిప్ట్ సిద్ధమైందన్న త్రివిక్రమ్ ప్రకటనతో ఈ సినిమాపై చర్చ మరోసారి ఊపందుకుంది. టైటిల్, కథా నేపథ్యం



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com